బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ సోమవారం 07, సెప్టెంబర్-2026 balagamtv100@gmail.com పేజీలు-8


వైఫల్యాల డైవర్షన్‌కే రేవంత్ డ్రామాలు



వివరాలు 3లో..

ఇస్రోను ప్రైవేటీకరించం..



వివరాలు 4లో..

# మరో సమరానికి సిద్ధం కండి..

- సాగునీటి కోసం లక్షల మందితో మరో ఉద్యమం..
- నిరసనల విజయవంతంపై సంతృప్తి
- కేసీఆర్ పిలుపు

హైదరాబాద్, సెప్టెంబర్ 06: సాగునీటి కోసం బీఆర్ఎస్ మరో సమరానికి సిద్ధమైంది. నీళ్లు అందుబాటులో ఉన్నా కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రా జెక్టుల ద్వారా ఎత్తిపోతలపై నిర్లక్ష్యం వహిస్తున్న కాంగ్రెస్ సర్కార్‌ను ఎండగట్టేం దుకు రెడీ అయింది. ఈ మేరకు ఆదివారం ఎర్రవల్లిలో నిర్వహించిన బీఆర్ఎస్ ఎల్పీ సమావేశం వేదికగా పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సుమారు రెండుగంటల పాటు సాగిన సమావేశంలో సోమవారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. లేవనెత్తాల్సిన ప్రజాసమస్యలను ప్రస్తావించారు. ఈ విషయంలో ముందుకెళ్లే తీరుపై దిశానిర్దేశం చేశారు. అన్నివర్గాలను మోసం చేసిన సర్కార్‌ను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ప్రాజెక్టుల్లో నీళ్లున్నా విడుదల చేయకుండా ప్రజలు, రైతులను ప్రభుత్వం ఆందోళనకు గురిచేయడంపై కేసీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనకు మూడేండ్లు పూర్తవుతున్న తరుణంలో పార్టీ నాయకులు మౌనం వీడాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీలో ప్రజాసమస్యలపై గట్టిగా పోరాడాలని, ప్రజాక్షేత్రంలో నిలదీయాలని దిశానిర్దేశం చేశారు. తెలంగాణ ఉద్యమం సాగింది. త్యాగాలు చేసి మిగతా 3లో..







# తులం బంగారం ఎవరూ అడగట్లే..

- కల్యాణలక్ష్మీ పథకంపై చేతులెత్తేసిన టీపీసీసీ చీఫ్!



హైదరాబాద్, సెప్టెంబర్ 06: ఎన్నికల సమయంలో ప్రజలకు తామిచ్చిన తులం బంగారం హామీ ని అమలు చేయలేమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పరోక్షంగా చేతులెత్తేశారు. తాము హామీ ఇచ్చినప్పుడు బంగారం ధర ఎంత? ఇప్పుడు ఎంత? అని బేరీజు వేశారు. తులం బంగారం ఎవరూ అడగడమే లేదంటూ తప్పించుకొనే ప్రయత్నం చేశారు. ఆదివారం ఓ టీవీ చానల్ డిబేట్‌లో పాల్గొన్న ఆయన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాల్లో తులం బంగారం హామీని ఎందుకు అమలు చేయడం లేదని మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నలకు పైవిధంగా స్పందించారు. టీడీపీ మొత్తం కాంగ్రెస్‌లోకి వచ్చేస్తున్నదని, రాష్ట్రంలో టీడీపీ ఎక్కడున్నదని ఆయన మరో కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీలోకి కొత్త నీరు రావాల్సిందేనని, టీడీపీ నేతలను చేర్చుకుంటామని స్పష్టంచేశారు. తమ ప్రభుత్వానికి 10 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలు అండగా నిలిచారని కూడా ఒప్పుకోవడం గమనార్హం. త్వరలో జరుగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు రెఫరెండంగా భావిస్తారా? అన్న ప్రశ్నకు స్పందిస్తూ.. రిఫరెండానికి ఆయన అంగీకరించలేదు. గెలుపోటములు సహజం అంటూ దాటవేశారు.

## ఉద్యోగ జేఏసీతో చర్చలు విఫలం



- జేఏసీ నేతలతో డిప్యూటీ సీఎం భేటీ
- 4 డిమాండ్లపై పట్టుబట్టిన జేఏసీ
- సోమవారంలోగా డీఏలపై నివేదిక
- అందజేయాలని సీఎస్‌కు భట్టి ఆదేశం
- నేడు ఎంప్లాయిస్ జేఏసీ భేటీ

వివరాలు 2లో..

# అసెంబ్లీ తర్వాత రణరంగంలోకి కేసీఆర్

- మాజీ మంత్రి, పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు



హైదరాబాద్, సెప్టెంబర్ 06: అసెంబ్లీ సమావేశాల తర్వాత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రణరంగంలోకి దిగుతారని మాజీ మంత్రి, పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ప్రకటించారు. అన్ని వర్గాలను వంచిస్తున్న దుర్మార్గపు ప్రభుత్వంపై లక్షలాది మందితో ప్రత్యక్ష ఉద్యమానికి శ్రీకారం చుడుతారని వివరించారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి జలాల ఎత్తిపోతలపై కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ మహాపోరాటం చేస్తారని చెప్పారు.గతంలో ఎన్టీఆర్, జయలలిత, చంద్రబాబు లాంటి నాయకులను సభలో అవమానిస్తే వారు అసెంబ్లీని బహిష్కరించి, ప్రజాక్షేత్రంలో గెలిచి తిరిగి ముఖ్యమంత్రులుగా అడుగుపెట్టారని గుర్తుచేశారు. మిగతా 3లో..

# ఉద్యోగుల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యం

- ఈహెచ్ఎస్ అమల్లో రాజీ లేదు : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశం



హైదరాబాద్, సెప్టెంబర్ 06: ఇందిరమ్మ ప్రజాప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం పట్ల ఎంతో పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని మహాత్మా జోతిబాపూలే ప్రజాభవన్‌లో ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ట్రస్ట్ బోర్డు (ఈహెచ్‌సీటీ) సభ్యులు, ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి భట్టి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మిగతా 3లో..

## మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నం!

- ఈశ్వర్‌సాయి విషయంలో పోలీసుల నిర్లక్ష్యమే కారణమంటూ ప్రచారం



హైదరాబాద్, సెప్టెంబర్ 06: ప్రముఖ ఫోక్ డ్యాన్సర్ మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నం చేసినట్టు ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మరో ఫోక్ సింగ ర్ ఈశ్వర్‌సాయిని పట్టుకోవడంలో పోలీ సుల నిర్లక్ష్యమే ఈ నిర్ణయానికి కారణమని ప్రచారం జరిగింది. ఈశ్వర్‌సాయి, మాధురి రాథోడ్ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడలో గత నెల 16న ఓ గదిలో ఉండగా ఆయన భార్య శరణ్య పట్టుకున్నట్టు వీడియోలు వైరల్ అయ్యాయి. ఈశ్వర్‌సాయి తనను పెండ్లి చేసుకుంటానని చెప్పి మోసగించాడని గత నెల 21న నార్సింగి పోలీసులకు మాధు రి ఫిర్యాదు చేసింది. ఆ తర్వాత పోలీసులు సకాలంలో స్పందించడం లేదంటూ రెండు రోజుల తర్వాత ఆమె ఇంటిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యాయత్నం చేస్తుండగా కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించినట్టుగా తెలిసింది.

## నేడు నిరుద్యోగుల అసెంబ్లీ ముట్టడి!

- ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని డిమాండ్
- నిరుద్యోగ భృతి ఏమైందంటూ నిలదీత
- 20వేల పోలీసు ఉద్యోగాల కోసం పట్టు
- పెద్దఎత్తున తరలిరావాలని జేఏసీ పిలుపు
- భారీగా పోలీసు బలగాల మోహరింపు

వివరాలు 2లో..

## వైఫల్యాల డైవర్షన్‌కే రేవంత్ డ్రామాలు



- సీఎం తీరు ప్రజాస్వామ్యానికి చేటు
- కేసీఆర్‌కు రక్షణ రాజ్యాంగ బాధ్యత
- తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ నేతల ఫైర్

3లో..

## సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం




- అనురాగ్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ మహీపతి శ్రీనివాసరావు,
- తెలంగాణ బాలోత్సవ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

హైదరాబాద్, సెప్టెంబర్ 06: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పలువురు వక్తలు కొనియాడారు. తెలంగాణ బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ నారాయణగూడలోని భారత్ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ మిగతా 3లో..

## కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ పదవులకు పోటాపోటీ

- మహబూబ్‌నగర్ నుంచి సామాకు ఓకే?
- నల్లగొండ నుంచి అమిత్‌రెడ్డి, పీవీ శ్రీనివాస్‌లలో ఒకరికి ఛాన్స్



హైదరాబాద్, సెప్టెంబర్ 06: అధికార కాంగ్రెస్ లో ఎమ్మెల్సీ పదవులకు విపరీతమైన పోటీ నెలకొంది. వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించబోయే నల్లగొండ-ఖమ్మం- వరంగల్, మహబూబ్ నగర్-హైదరాబాద్-రంగారెడ్డి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు రంగం సిద్ధమైన నేపథ్యంలో సీనియర్ నేతలు, ఆశావహులు తమతమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఆయా స్థానాల్లో ఎవరెవరికి స్థానం కల్పించాలనే దానిపై ఇటీవల ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్ స్థాయిలోనే లోతైన చర్చ జరిగినట్టు సమాచారం. ఆ తర్వాత డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నివాసంలో కూడా దీనిపై సమాలోచనలు చేసినట్టు తెలిసింది. గ్రాడ్యుయేట్ స్థానాలకు సంబంధించి ఇప్పటికే ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరించిన నేపథ్యంలో వాటిని మరింతగా మిగతా 3లో..

## ఆటోవాలా.. పోరుబాట..



- కాంగ్రెస్ ప్రభుత్వ 'అబద్ధాల హామీల'పై రణనినాదం
- బీఆర్ఎస్ సమరభేరిలో భాగస్వామ్యమైన డ్రైవరన్నలు
- నగరవ్యాప్తంగా ర్యాలీలు.. హోరెత్తిన నిరసనలు
- ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుతాం
- ఆటో కార్మికుల ర్యాలీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల హెచ్చరిక

# పీఆర్సీ, డీఏలు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి?



- చర్చలు తప్ప పరిష్కారం శూన్యం : వీ లచ్చిరెడ్డి ఫైర్

హైదరాబాద్, సెప్టెంబర్ 06: ఉమ్మడి రాష్ట్రంలో ఎప్పుడు ఉద్యోగుల పీఆర్సీ, డీఏలు పెండింగ్‌లో లేవని, స్వరాష్ట్రంలో ఎందుకున్నాయని ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ వీ లచ్చిరెడ్డి ప్రశ్నించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగుల సంకల్ప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సకల జనుల సమ్మె చేసి తెలంగాణ తెచ్చుకోవడమే ఉద్యోగుల చేసిన తప్పా అని ప్రశ్నించారు.సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కులు అనేకసార్లు ఉద్యోగులతో చర్చలు జరిపారని, చర్చలు తప్ప పరిష్కారం చూపలేదని మండిపడ్డారు. ఈహెచ్ఎస్ ప్రారంభించినా అమలులో అనేక లోపాలున్నాయని విమర్శించారు. రిటైర్మెంట్ బెనిఫిట్లు అందక ఉద్యోగులు తీవ్ర మానసిక వేదనను అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జేఏసీ సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి ఉద్యోగులంతా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. పీఆర్సీ, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, 2004కు ముందు నియమితులైన వారికి ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### సీఎం వ్యాఖ్యలు ఆక్షేపనీయం : యూటీఎఫ్

పీఆర్సీ, పెండింగ్ డీఏల కోసం ఇంకా రెండేండ్లు వేచి చూడాలన్న సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను టీఎస్ యూటీఎఫ్ ఖండించింది.

మూడేండ్ల ఆలస్యానికి కారణాలు చెప్పకుండా మరో రెండేండ్లు ఆగాలనడం తీవ్ర ఆక్షేపనీయమని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవి, వెంకట్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పండుగ రోజు వరాలు కురిపిస్తారని ఆశించిన టీచర్లకు ఆశాభంగం కలిగిందని తెలిపారు. వెంటనే ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

# నేడు నిరుద్యోగుల అసెంబ్లీ ముట్టడి!

- ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని డిమాండ్
- నిరుద్యోగ భృతి ఏమైందంటూ నిలదీత
- 20వేల పోలీసు ఉద్యోగాల కోసం పట్టు
- పెద్దఎత్తున తరలిరావాలని జేఏసీ పిలుపు
- భారీగా పోలీసు బలగాల మోహరింపు



హైదరాబాద్, సెప్టెంబర్ 06: ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు మరోసారి ఆందోళన బాట పట్టారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అసెంబ్లీ ముట్టడికి నిరుద్యోగ జేఏసీ పిలుపునిచ్చింది. కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి అమలు చేయాలని, పాత జాబ్ క్యాలెండర్‌ను రద్దు చేసి, కొత్త క్యాలెండర్‌ను ప్రకటించాలని జేఏసీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.ప్రత్యేకంగా పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం ప్రతిపాదించిన పోస్టులను 20 వేలకు పెంచాలని పోలీసు ఉద్యోగార్థులు పట్టుబడుతున్నారు. ఈ అంశంపై జూన్‌లోనే నిరుద్యోగ యువత పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహించింది. అయితే, ప్రభుత్వం 7,437 పోస్టులతో మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడంతో పోలీసు ఉద్యోగాల కోసం పోటీ పడుతున్న అభ్యర్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి లక్షలాదిగా నిరుద్యోగులు తరలిరావాలని నిరుద్యోగ జేఏసీ పిలుపునిచ్చింది. నిరుద్యోగుల ప్రధాన డిమాండ్లలో జాబ్ క్యాలెండర్ ఒకటి. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు ఏర్పడినప్పుడు వాటిని గుర్తించి, ఏ శాఖలో ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి? ఎప్పుడు నోటిఫికేషన్ ఇస్తారు? ఎప్పుడు పరీక్షలు నిర్వహిస్తారు? ఎప్పుడు ఫలితాలు ప్రకటిస్తారు? ఎప్పుడు నియామకాలు చేపడుతారు? అనే అంశాలపై ముందుగానే స్పష్టత ఇవ్వాలని నిరుద్యోగులు కోరుతున్నారు. నోటిఫికేషన్ కోసం ఏండ్ల తరబడి ఎదురుచూసే పరిస్థితికి ముగింపు పలకాలని, ప్రతి సంవత్సరం ఖాళీలను గుర్తించి, నిర్ణీత సమయంలో నియామకాలు చేపట్టాలని నినదిస్తున్నారు. గతంలో అసెంబ్లీ సాక్షిగా ప్రవేశపెట్టిన జాబ్ క్యాలెండర్ అపహాస్యంగా మారడం, దాని ప్రకారం ఒక్కటంటే ఒక్క పోస్టు కూడా భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగులు అసహనంతో ఉన్నారు. అందుకే గతంలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌ను రద్దు చేసి ఖాళీలకు అనుగుణంగా వాస్తవికమైన కొత్త జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని కోరుతున్నారు.ఉద్యోగం లభించే వరకూ నిరుద్యోగులకు నెలవారీ ఆర్థిక సహాయం అందిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని నిరుద్యోగ జేఏసీ గుర్తు చేస్తున్నది. నిరుద్యోగ యువతకు నెలకు రూ.4వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామన్న ఎన్నికల హామీని అమలుచేయలేదని విమర్శిస్తున్నారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఆలస్యమవుతుండటంతో కోచింగ్ ఫీజులు, హాస్టల్ వసతి, ప్రయాణ ఖర్చులు, పుస్తకాలు, పరీక్ష ఫీజులు వంటి ఖర్చులు భరించలేక అనేక మంది అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అందుకే ఉద్యోగం వచ్చే వరకూ నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. లక్షలాదిమంది నిరుద్యోగులకు ఏడు వేల పోలీసు పోస్టులు సరిపోవని, 20వేల పోస్టులతో నోటిఫికేషన్ సవరించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే డిమాండ్‌తో జూన్ 29న హైదరాబాద్‌లోని తెలంగాణ స్టేట్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు కార్యాలయం వద్ద నిరుద్యోగులు ఆందోళన నిర్వహించారు. తాజాగా సోమవారం అసెంబ్లీ ముట్టడికి నిరుద్యోగ జేఏసీ పిలుపుతో.. పోలీసు శాఖ అప్రమత్తమైంది. భారీగా బలగాలను మోహరించింది.

# మరో నలుగురికి కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీ నోటీసులు



హైదరాబాద్, సెప్టెంబర్ 06: కాంగ్రెస్ పార్టీలో మరో నలుగురు నేతలకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డికు క్రమశిక్షణా కమిటీ షోకాజ్ నోటీసులు ఇచ్చింది. కొంతకాలంగా కాంగ్రెస్‌లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిల మధ్య ఆధిపత్య పోరు నడుస్తున్నది. ఉట్నూర్‌లో ఇటీవల జరిగిన పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశానికి ఆహ్వానం లేకపోయినా సంజీవరెడ్డి వచ్చారంటూ కంది శ్రీనివాస్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు.ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ సమక్షంలోనే ఒకరినొకరు తిట్టుకున్నారు. దీంతో ఈ ఘటనపై వివరణ కోరు తూ ఇద్దరికి క్రమశిక్షణా కమిటీ నోటీసులు జారీ చేసింది. మరోవైపు గజ్వేల్ నియోజకవర్గంలో నర్సారెడ్డి, జూపల్లి మల్లారెడ్డికి కూడా క్రమశిక్షణ కమిటీ నోటీసులిచ్చింది. నర్సారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మల్లారెడ్డి పీసీసీకి ఫిర్యాదు చేయడంతో నోటీసులు ఇచ్చారు.

# ఉద్యోగ జేఏసీతో చర్చలు విఫలం

- జేఏసీ నేతలతో డిప్యూటీ సీఎం భేటీ
- 4 డిమాండ్లపై పట్టుబట్టిన జేఏసీ
- సోమవారంలోగా డీఏలపై నివేదిక
- అందజేయాలని సీఎస్‌కు భట్టి ఆదేశం
- నేడు ఎంప్లాయీస్ జేఏసీ భేటీ



హైదరాబాద్, సెప్టెంబర్ 06: పీఆర్సీ, పెండింగ్ డీఏల విడుదల సహా పలు సమస్యల పరిష్కారం కోసం ఉద్యమానికి దిగిన తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీతో ప్రభుత్వం జరిపిన చర్చలు విఫలమయ్యాయి. ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వలేదు. దీంతో ఎలాంటి పరిష్కారం లేకుండానే చర్చలు అర్ధాంతరంగా ముగిశాయి. ఎంప్లాయీస్ జేఏసీ నేతలతో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఆదివారం బేగంపేటలోని ప్రజాభవన్‌లో చర్చలు జరిపారు.జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, టీజీవో, టీఎన్జీవో ప్రధాన కార్యదర్శులు బీ శ్యామ్, హుస్సేనీ, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందంగౌడ్, రమేశ్, రవి పాల్గొన్నారు. పీఆర్సీ, పెండింగ్ డీఏలు, సీపీఎస్ రద్దు, పెండింగ్ బిల్లుల విడుదల అంశాలను నేతలు ప్రస్తావించారు. పీఆర్సీ, పెండింగ్ డీఏల విడుదలపై సర్కార్ స్పష్టత ఇవ్వలేదు. నాన్చివేత ధోరణి అవలంబించింది. ప్రభుత్వం పీఆర్సీ నివేదిక తెప్పించుకోవాలని, మూడు డీఏలు విడుదల చేయాలని జేఏసీ నేతలు కోరారు. డీఏల విడుదలపై సోమవారంలోగా నివేదిక సమర్పించాలని సీఎస్‌ను భట్టి ఆదేశించారు. సీపీఎస్ అంశం తన పరిధిలో లేదని, డిప్యూటీ సీఎం భట్టి స్పష్టంచేశారు. అసెంబ్లీ సమావేశాలు జరిగే సమయంలో ఉద్యమం చేస్తామంటే ఎట్లా? పునరాలోచించాలని జేఏసీ నేతలను విక్రమార్క కోరారు. రాష్ట్రంలో ఉద్యోగులు ఆగ్రహంతో ఉన్నారని, నిర్దిష్టంగా ఏదో ఒక హామీ ఇస్తే ఆలోచిస్తామని జేఏసీ నేతలు స్పష్టంచేశారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత భేటీ అవుదామని చెప్పగా, ఇప్పుడే తేల్చాలని జేఏసీ పట్టుబట్టినట్టు సమాచారం. తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ కార్యవర్గం సోమవారం అత్యవసరంగా సమావేశం కానున్నది. నాంపల్లిలోని టీఎన్జీవో భవన్‌లో ఈ సమావేశాన్ని నిర్వహించి.. అందరి అభిప్రాయాలనే జేఏసీ నేతలు స్వీకరిస్తారని సమాచారం.

# ఈహెచ్ఎస్ అమలు చేయకపోతే చర్యలు!

- దవాఖానలకు కరెంట్, వాటర్ సప్లయ్ కట్ చేసే యోచనలో సర్కార్

హైదరాబాద్, సెప్టెంబర్ 06: రాష్ట్రంలో ఎంప్లాయీస్ హెల్త్ స్కీం(ఈహెచ్ఎస్) అమలు చేయని ప్రైవేట్ దవాఖానలపై సర్కార్ కరెంట్, వాటర్ కట్ చేసే దిశగా ఆలోచిస్తున్నట్టు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ఈహెచ్ఎస్ స్కీమ్‌ను జూలై 17న ప్రారంభించగా, సరిగా అమలు కావడం లేదని, 10శాతం కూడా అమలుచేయడం లేదని ఎంప్లాయీస్ జేఏసీ ఆరోపించిన విషయం తెలిసిందే. దవాఖానలు అనుసరిస్తున్న వైఖరితోనే ఈ స్కీమ్ సక్రమంగా అమలుకావడం లేదన్న భావనలో సర్కార్ వర్గాలున్నట్టు తెలుస్తున్నది. సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్‌ను అమలుచేస్తున్నట్టుగా ఈహెచ్ఎస్‌ను అమలుచేయకపోవడంతో ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నట్టు సమాచారం. ఎంతమంది రోగులకు ప్రైవేట్ దవాఖానలు ఉచిత వైద్యమందించాయి, ప్రభుత్వ స్థలాలు పొందిన దవాఖానలు ప్రజా సంక్షేమ కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నాయన్న విషయాలపై ఓ నివేదిక కోరనున్నట్టు తెలిసింది.తాజా వార్తలు చదవండి

### ఈహెచ్ఎస్ అమల్లో రాజీవద్దు : భట్టి

హైదరాబాద్, సెప్టెంబర్ 06: ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) అమల్లో రాజీపడొద్దని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఈ పథకాన్ని ఆషామాషీగా తీసుకోవద్దని హెచ్చరించారు. ఆదివారం ప్రజాభవన్‌లో సీఎస్ సంజయ్ జాజు సహా ట్రస్టుబోర్డు సభ్యులతో సమీక్ష నిర్వహించారు. పథకం అమల్లో సమన్వయం లోపంపై డిప్యూటీ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కీమ్ అమల్లో అధికారులే కాకుండా.. ఉద్యోగ సంఘాల నేతలు సైతం తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించారు.

# అంకితభావమే ఉద్యోగికి కీలకం



- పట్టుదల తోడైతే విజయ సోపానమే
- ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీత
- అసిస్టెంట్ ఇంజినీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గవ్వా ఉద్యోగ విరమణ

హైదరాబాద్, సెప్టెంబర్ 06: అంకితభావమే ప్రతి ఉద్యోగికీ కీలకమని, పట్టుదల తోడైతే ఆ ఉద్యోగి తన విధుల్లో విజయం సాధించి తీరుతారని ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి కొనియాడారు. హైదరాబాద్ నాగోల్‌లో ఆదివారం జరిగిన తెలంగాణా రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ వర్క్ ఇన్‌స్పెక్టర్స్, అసిస్టెంట్ ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గవ్వా రవీందర్‌రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. గవ్వా రవీందర్‌రెడ్డి 43 సంవత్సరాల పాటు గృహనిర్మాణ శాఖలో విజయవంతంగా విధులు నిర్వహించారని కొనియాడారు. ఉద్యోగుల హకులకోసం పోరాడి సర్వీస్ రెగ్యులర్ చేయించారని తెలిపారు. ప్రమోషన్లు, పీఆర్సీ, ఐఆర్, డీఏ అమలు చేయించడంలో సఫలమయ్యారని చెప్పారు. అసోసియేషన్ రాష్ట్ర మాజీ కార్యదర్శి బొగ్గుల వెంకటరామిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన సన్మానసభలో హౌసింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు ఈశ్వరయ్య, రవీందర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, బాలకృష్ణారెడ్డి, దాశరథిశర్మ, రాందేవ్‌రెడ్డి, భాసర్‌రెడ్డి, రఘువీర్, కుటుంబసభ్యులు, బంధుమిత్రులు పాల్గొని ఘనంగా సతరించారు.

# డిమాండ్లు పరిష్కరించకుంటే సీఎం ఇల్లు ముట్టడి



### 1969 ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు రామరాజు

హైదరాబాద్, సెప్టెంబర్ 06: 1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రహరి రామరాజు హెచ్చరించారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ప్రగతినగర్ కమ్యూనిటీ హాల్లో ఆదివారం జరిగిన 1969 ఉద్యమకారుల రాష్ట్రస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నాటి ఉద్యమంలో పాల్గొన్న 90 శాతం మంది వద్ద ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టంచేశారు. తొలిదశ ఉద్యమంలో ఎలక్ట్రానిక్ మీడియా లేదని, ప్రింట్ మీడియా ఉన్నా ఒకటి, రెండు పేపర్లు మాత్రమే ఉండేవని తెలిపారు.నాటి ఉద్యమంలో జైలుకెళ్లిన వారు తమ గుర్తింపు కోసం పోలీస్ అధికారుల వద్దకు వెళ్లి తమకు ఆధారాలు ఇవ్వాలని వేడుకున్నా ఎలాంటి ఆధారాలు లేవని చెప్పినట్టు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పాత పది జిల్లాల్లో తిరిగి జిల్లా కమిటీలను ఏర్పాటుచేసి లభించిన సమాచారం మేరకు ఉద్యమకారుల లిస్టు తయారుచేసి ప్రభుత్వానికి, ఉద్యమకారుల గుర్తింపు కమిటీకి అందించినట్టు చెప్పారు. ఉద్యమంలో పాల్గొన్న వారిలో ఇప్పటికే మూడొంతుల మంది మృతి చెందారని, మిగిలిన వారు 3 నుంచి 4 వేల మంది వరకే ఉంటారని తెలిపారు. వీరిని కమిటీ గుర్తించి గుర్తింపు కార్డులు, హెల్త్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చనిపోయిన వారి భార్యలను కూడా ఉద్యమకారులుగా గుర్తించాలని కోరారు.లేనిపక్షంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే టీ సుదర్శన్‌రావు, సంఘం ఉపాధ్యక్షులు వనం చంద్రమౌళి, కే సీతారాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి మారం సంతోష్‌రెడ్డి, కోశాధికారి చంద్రారెడ్డి, వివిధ జిల్లాల ప్రతినిధులు శ్రీహరి మూలకండ్ల, లక్ష్మీనారాయణ, కూతురు కృష్ణమూర్తి, కే మోహన్ రావు, రామణి, జయప్రకాశ్, విశ్వేశ్వర్‌రావు, రుద్రమ్మ, వేముల లింగయ్య, జగిని దయానంద్, గోపు చలీనమ్మ, రాజలింగం, ముత్తినేని వెంకటేశ్వర్‌రావు, శివంగుల కృష్ణ పాల్గొన్నారు.

# పంటలు ఎండుతున్నయ్.. కరెంట్ ఇవ్వండి

- లోవోల్టేజ్ విద్యుత్తు సమస్యను పరిష్కరించాలని వేడుకోలు
- కోతలను నిరసిస్తూ సబ్‌స్టేషన్‌ల ఎదుట అన్నదాతల ఆందోళన



హైదరాబాద్, సెప్టెంబర్ 06: వ్యవసాయానికి విద్యుత్తు కోతలను నిరసిస్తూ ఆదివారం రైతులు ఆందోళన బాటపట్టారు. లోవోల్టేజ్ సమస్యలతో మొక్కజొన్న, వరి పంటలు ఎండిపోతున్నాయని, కరెంటు ఇవ్వండి సారూ.. అంటూ విద్యుత్తు అధికారులను వేడుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలంలోని పోలారం సబ్‌స్టేషన్ వద్ద ఏఐకేఎంఎస్, పీవైఎల్ నాయకులతో కలిసి ఆందోళన చేశారు.జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం ఆలూరు సబ్‌స్టేషన్ చేరుకున్న రైతులు విద్యుత్ కోతలతో తాము పడుతున్న ఇబ్బందులను సిబ్బందికి వివరించారు. గట్టు-గద్వాల రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. అనంతరం జీఎంపీఎస్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సరితను కలిసి సమస్యలను వివరించారు. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండల రైతులు విద్యుత్తు సరఫరా చేయాలని సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు.

# రేవంత్‌రెడ్డిది బూతుల పాలన..

- కేటీఆర్‌తో చర్చపై సీఎంకు దమ్ముందా?
- బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశంలో ఎమ్మెల్సీ దాసోజు



హైదరాబాద్, సెప్టెంబర్ 06: సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పరిపాలన చేతగాక చిల్లర రాజకీయాలతో బూతుల పాలన చేస్తున్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ధ్వజమెత్తారు. ఆదివారం ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసంలో జరిగిన బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సచివాలయంలో కూర్చొని ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలుచేయాల్సిన అధికార పార్టీ ఇందిరాపార్ వద్ద ధర్నా చేయడం హాస్యాస్పదమని మండిపడ్డారు.'చెల్లని రూపాయికి గీతలు ఎకువ.. చేతగాని రేవంత్ రెడ్డికి బూతులు ఎకువ' అంటూ ఎద్దేవా చేశారు. హామీలు నెరవేర్చలేక బజారు భాష వాడుతున్నారని, ఇది సీఎం రేవంత్ సైకోపాత్ మనస్తత్వానికి నిదర్శనమని చెప్పారు.

# (మొదటిపేజీ తరువాయి)

## మరో సమరానికి సిద్ధం కండి..



తెలంగాణను తెచ్చుకున్నది సాగునీటి కోసమేనని స్పష్టంచేశారు. తెలంగాణకు జీవధార అయిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ చేసింది దుష్ప్ర చారమని, కుట్రపూరితంగానే నీటిని ఎత్తిపోయడంలేదనే వాస్తవం ఎన్డీఎస్ఏ ప్రకటనతో తేటతెల్లమైందని వివరించారు. బీఆర్ఎస్ పాలనలో 90 శాతం పూర్తయిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును నిర్లక్ష్యం చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. నాగార్జునసాగర్, శ్రీశైలం లాంటి ప్రాజెక్టుల్లో నీళ్లున్నా పంటలకు విడుదల చేయకపోవడం దారుణమని మండిపడ్డారు. సాగునీటి రంగంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై జలయుద్ధానికి సిద్ధం కావాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించి పార్టీలోని ముఖ్యనేతలతో చర్చించి ప్రత్యక్ష కార్యాచరణ విధివిధానాలు ఖరారు చేస్తామని చెప్పారు.అప్రజాస్వామిక విధానాలను తిప్పికొట్టాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలను చర్చావేదికగా కాకుండా బూతు కూతలకు నిలయంగా మార్చడంపై కేసీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. నోటికొచ్చినట్టు మాట్లాడుతూ ప్రతిపక్ష సభ్యులను సభలో తూలనాడుతున్న కాంగ్రెస్ అప్రజాస్వామిక విధానాన్ని ఉభయసభల్లో తిప్పికొట్టాలని బీఆర్ఎస్ సభ్యులకు పిలుపునిచ్చారు. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టు జలాలను తెలంగాణ రైతాంగానికి దక్కకుండా, పక్క రాష్ట్రం వాడుకొనేలా ప్రభుత్వం సహకరిస్తున్నదని విమర్శించారు.వంద రోజుల్లో అమలు చేస్తామన్న ఆరు గ్యారెంటీలు, 420 హామీలను వెయ్యి రోజులైనా నెరవేర్చకపోవడంపై సర్కార్ తీరును అసెంబ్లీ సమావేశాల్లో ఎండగట్టాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ పిలుపునిచ్చారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనా వైఫల్యంపై బీఆర్ఎస్ చేపట్టిన నిరసన కార్యక్రమాల విజయవతంపై సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ ముఖ్య నేతలు, జిల్లా నాయత్వాన్ని అభినందించారు. పేదల సంక్షేమంపై కాంగ్రెస్ చేస్తున్న నిర్లిప్త వైఖరిని అసెంబ్లీ, మండలిలో గట్టిగా నిలదీయాలని దిశానిర్దేశం చేశారు. గ్రామాలు, పట్టణాల్లోని పట్టా భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడంతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, పిల్లల పెండ్లిళ్లు, దవాఖాన ఖర్చులు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో తమ భూమిని అమ్ముకొనే అవకాశం లేక ప్రజలు అరిగోస పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 22ఏ సమస్యపై ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని ఉద్బోధించారు. రాష్ట్రంలో కరువు మేఘాలు కమ్ముకున్న నేపథ్యంలో మిషన్ భగీరథ లాంటి తాగునీటి వ్యవస్థను నిర్వీర్యం చేసి ప్రజల తాగునీటి అవసరాలను తీర్చని ప్రభుత్వానికి సిగ్గుండాలని నిప్పులు చెరిగారు. ఈ విషయంపై సభలో ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని చెప్పారు.

## ఉద్యోగుల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యం

ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, డిపెండెంట్ల ఆరోగ్య భద్రత కోసం తీసుకొచ్చిన నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని ప్రభుత్వం సమర్థంగా అమలు చేస్తుందని చెప్పారు. దశాబ్దాలుగా ఉద్యోగులు ఎదురుచూస్తున్న సమస్యను మానవీయ కోణంలో పరిష్కరిం చాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. ప్రభుత్వంలో పనిచే స్తున్న ఉద్యోగులంతా తమవారేననీ, వారు ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని అన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, డిపెండెంట్లు గానీ అనారోగ్యానికి గురైనప్పుడు ఆర్థిక, మానసిక ఇబ్బందులకు గురికాకూడదన్న ఉన్నతమైన ఆశయంతోనే అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ పథకం రూపకల్పన, విధివిధానాల విషయంలో ఉద్యోగ సంఘాలతో అనేకసార్లు సమావేశాలు నిర్వహించి, వారి సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నామని వివరించారు. ఉద్యోగుల గురించి మానవీయ కోణంలో ప్రజాప్రభుత్వం తెచ్చిన పథకాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు.

### ఆరోగ్య కార్డుల జారీని వేగవంతం చేయాలి

ఈహెచ్ఎస్ పథకంలో ఇప్పటికే 354 ప్రయివేట్ ఆస్పత్రులు ఉన్నాయనీ, మరికొన్ని ఆస్పత్రులను డీమ్డ్ ఎంప్యానెల్డ్ విధానంలో చేర్చామని భట్టి చెప్పారు. ఆయా ఆస్పత్రుల యాజమాన్యాలతో సమావేశాలు నిర్వహించి, పథకం సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆరోగ్య కార్డుల జారీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన ఈ పథకాన్ని ఎవరూ అషామాషీగా తీసుకోవద్దని ఉన్నతాధికారులను కోరారు. ఉద్యోగుల ఆరోగ్యానికి సంబంధించిన ఈ అంశంపై ప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు. ఈ పథకాన్ని అమలు చేయాలన్న స్పష్టమైన సంకల్పంతో ప్రజాప్రభుత్వం ఉందని చెప్పారు. ఉద్యోగుల సమస్యలను పదేండ్లుగా ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఆరోగ్య పథకాన్ని అమల్లోకి తెచ్చిందని గుర్తు చేశారు. ఉద్యోగుల ఆరోగ్యం, వారి కుటుంబాల సంక్షేమం విషయంలో ఈ ప్రభుత్వం అత్యంత నిబద్ధతతో ఉందన్నారు. ఆరోగ్య కార్డుల పథకాన్ని విజయ వంతం చేయడంలో అధికారులు, ఉద్యోగ సంఘా ల నాయకులు బాధ్యతను సమర్థంగా నిర్వర్తిం చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, జీఏడీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ మహేష్ దత్ ఎక్కా, వైద్యా రోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి క్రిస్టీనా జెడ్ చోంగ్తు, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, ఈహచ్ఎస్ సీఈఓ హనుమంతు, ఉద్యోగ సంఘాల నాయకులు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు, వి లచ్చిరెడ్డి, ఎ వెంకట్, పుల్గం దామోదర్‌రెడ్డి, జి సదానందంగౌడ్, బి శ్యామ్, ముజీబ్ హుస్సేనీ, పి మధుసూదన్‌రెడ్డి, కటకం రమేశ్, పి కృష్ణమూర్తి, పి వెంకట్‌రెడ్డి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ తర్వాత రణరంగంలోకి కేసీఆర్

కేసీఆర్‌ది సైతం అదేబాట అని తేల్చిచెప్పారు. అయినా అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి వాడే బజారు భాష వినేందుకు కేసీఆర్ అసెంబ్లీకి రావాల్సిన అవసరంలేదని కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న శాసనసభ, మండలి సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన ఆదివారం ఎర్రవల్లిలో బీఆర్ఎస్ఎల్పీ సమావేశం నిర్వహించారు. అనంతరం బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.

## సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ మహీపతి శ్రీనివాసరావు, ఓయాసిస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ జీఎస్. పరంజ్యోతి, బాలోత్సవం కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్. సోమయ్య పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి ప్రత్యేక వ్యక్తిత్వం, భిన్నమైన ఆసక్తులు, సామర్థ్యాలు కలిగి ఉంటారని తెలిపారు. వారిలోని ప్రతిభను గుర్తించి సరైన మార్గంలో నడిపించే శక్తి ఉపాధ్యాయులకే ఉందని అన్నారు. దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటుందని పేర్కొంటూ, ఉపాధ్యాయులు కేవలం పాఠాలు బోధించడానికే పరిమితం కాకుండా విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మార్గదర్శకులుగా, సమాజాన్ని తీర్చిదిద్దే శిల్పులుగా నిలుస్తున్నారని ప్రశంసించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, చర్చావేదిక, నాటికలు తదితర సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు మస్తాన్, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ పదవులకు పోటాపోటీ

పరిశీలించి, సామాజిక సమీకరణలు, నేతల సామర్థ్యాలు, పార్టీతో సమన్వయం తదితరాంశాలను పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించారు. అయితే అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం... మహబూబ్‌నగర్ స్థానానికి కాంగ్రెస్ మీడియా అండ్ కమ్యూనికేషన్ విభాగం మాజీ చైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి పేరును సీఎం రేవంత్ రెడ్డి దాదాపు ఖరారు చేసినట్టు తెలుస్తోంది. పార్టీ వాయిస్‌ను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లటం, మీడియా చర్చగోష్టుల్లో మిగతా వారి కంటే భిన్నంగా విశ్లేషణలు చేయటం, ప్రతిపక్షాలను సునిశితంగా, సూటిగా విమర్శించటం తదితరాంశాలను ఆయనకు కలిసొచ్చాయని అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. మరోవైపు నల్లగొండ స్థానం నుంచి మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తనయుడు గుత్తా అమిత్ రెడ్డి, ఆర్టీఐ కమిషనర్ పీవీ శ్రీనివాస్‌లలో ఎవరికో ఒకరికి ఛాన్స్ దక్కేలా కనబడుతోంది. వీరితోపాటు పలువురి పేర్లు తెరపైకి వచ్చినా ఆ ఇద్దరి పేర్లే ప్రముఖంగా వినబడుతున్నాయి. మరోవైపు నవంబరులో ఖాళీ కానున్న గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల కోసం సమాచార కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి, కరీంనగర్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం పేర్లు పరిశీలనలో ఉన్నట్టు సమాచారం.

# వైఫల్యాల డైవర్షన్‌కే రేవంత్ డ్రామాలు

### సీఎం తీరు ప్రజాస్వామ్యానికి చేటు
### కేసీఆర్‌కు రక్షణ రాజ్యాంగ బాధ్యత
### తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ నేతల ఫైర్



హైదరాబాద్, సెప్టెంబర్ 06: అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులవుతున్న సందర్భంగా పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే సీఎం రేవంత్‌రెడ్డి డ్రామాలాడుతున్నారని బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు రవీంద్ర కుమార్, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్ తీరుపై విరుచుకుపడ్డారుప్రజలకు ఇచ్చిన హామీలను ఎగ్గొట్టిన ఆయన వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి వ్యవహారశైలి ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టుగా మారిందని ధ్వజమెత్తారు. ప్రాణాన్ని పణంగా పెట్టి తెలంగాణను సాధించిన కేసీఆర్‌ను రాజీనామా చేయాలనడం దారుణమని మండిపడ్డారు. ప్రతిపక్ష నేత కేసీఆర్‌కు భద్రత కల్పించడం రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని, దీనిపై రూ. 22 కోట్ల ఖర్చు అంటూ సీఎం పిచ్చిగా మాట్లాడటమేందని విమర్శించారు. కేసీఆర్ పథకాలను ఎందుకు బంద్ చేశారో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు ఏమయ్యిందో చెప్పాలని ప్రశ్నించారు. కృష్ణా, గోదావరి జలాలను ఏపీకి ధారా దత్తం చేస్తూ రైతులను ముంచుతున్నారని మండిపడ్డారు.

### నల్లగొండకు చేసిందేమి లేదు: చిరుమర్తి

నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ సీఎం తన నియోజకవర్గానికి వచ్చి నిధులు కేటాయిస్తారనుకుంటే ఒంటినిండా విషంతో వచ్చి తిట్ల దండకం అందుకున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నకిరేకల్‌లో 100 పడకల దవాఖానతో సహా సమగ్ర అభివృద్ధి కేసీఆర్ హయాంలోనే జరిగిందని, రేవంత్ కొత్తగా ఒక రూపాయి పని కూడా ప్రకటించలేకపోయారని ఎద్దేవా చేశారు. రైతు బీమా , రైతుబంధుకు మంగళం పాడారని మండిపడ్డా రు. మూటలు ఇచ్చి పదవులు తెచ్చుకున్న బ్లాక్‌మెయిలర్ కేసీఆర్ భద్రత గురించి మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. ముందుగా సీఎం రేవంత్ కుటుంబ సభ్యుల భద్రత కోసం ప్రభుత్వ ఖజానా సొమ్మును దుబారా చేయడం ఆపాలని హితవు పలికారు. నల్లగొండ ప్రాజెక్టులను పడావు పెట్టిన చరిత్ర రేవంత్‌దేనని విమర్శించారు. రాష్ట్రంలో రేవంత్ సోదరులు, పొంగులేటి దందాలకు హద్దే లేకుండా పోయిందని, 22ఏ ద్వారా వేల కోట్లు సంపాదించారని ఆరోపించారు. సిద్దిపేట, సిరిసిల్లలో ఏదో చేస్తానంటున్న ఆయనముందు కొడంగల్‌లో గెలువాలని సవాల్ విసిరారు.

## ఆటోవాలా.. పోరుబాట..

- కాంగ్రెస్ ప్రభుత్వ 'అబద్ధాల హామీల'పై రణనినాదం
- బీఆర్ఎస్ సమరభేరిలో భాగస్వామ్యమైన డ్రైవరన్నలు
- నగరవ్యాప్తంగా ర్యాలీలు..హోరెత్తిన నిరసనలు
- ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుతాం
- ఆటో కార్మికుల ర్యాలీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల హెచ్చరిక



హైదరాబాద్, సెప్టెంబర్ 06: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, ఉప్పల్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో ఆటో కార్మికుల ర్యాలీల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హెచ్చరించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో జరిగిన ఆటో ర్యాలీలో ఆటో కార్మికులకు బాకీ పడ్డ రూ. 36 వేలను ఎప్పుడు చెల్లిస్తారని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ, వివేకానంద్ ప్రభుత్వాన్ని నిలదీశారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో జరిగిన ర్యాలీలో ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి మోసం చేసిందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి విమర్శించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మండిపడ్డారు. ఉప్పల్ నియోజకవర్గంలో జరిగిన ఆటో ర్యాలీలో ప్రజా సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం చేస్తామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హెచ్చరించారు.

## విద్యుత్ షాక్‌తో ఆర్టిజన్ మృతి

- లైన్‌మెన్‌కు బదులు ఆయన ఆదేశంతో విధులు
- అధికారుల నిర్లక్ష్యమే కారణమన్న బంధువులు
- మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆందోళన
- కాంట్రాక్టర్‌పై కేసు నమోదు

హైదరాబాద్, సెప్టెంబర్ 06: ఒకరికి బదులు మరొకరు విధులు నిర్వహిస్తూ అమాయకులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు నగరంలో వరుసగా జరుగుతున్నాయి. ఇటీవల పాతబస్తీలో ఓ యువకుడు లైన్‌మెన్‌కు బదులు నిర్వహిస్తుండగా షాక్ రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మరవకముందే మరొక ఘటన మీర్‌పేటలో జరిగింది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆర్టిసన్‌గా పనిచేస్తున్న కర్నాటి కృష్ణకాంత్ (43) ఆదివారం ఉదయం కరెంటు షాక్‌తో మృతి చెందారు. ఆయనకు భార్య శాంత , ఇద్దరు పిల్లలు ఉన్నారు. కృష్ణకాంత్ నల్గొండ జిల్లా చింతపల్లి మండల కురుమేడు గ్రామానికి చెందిన కృష్ణకాంత్ మీర్‌పేట్ నందనవనం సబ్‌స్టేషన్‌కు అనుబంధంగా విధులు నిర్వర్తిస్తున్నాడు. నందిహిల్స్ రోడ్డు నంబర్ 2లోని ఓ ఇంటికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

## హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు గుడ్‌న్యూస్..

### మెట్రో-ఆర్టీసీ ఉమ్మడి పాస్ త్వరలోనే!



హైదరాబాద్, సెప్టెంబర్ 06: హైదరాబాద్ మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో తరచూ ప్రయాణించే నగరవాసులకు గుడ్‌న్యూస్. మెట్రో--ఆర్టీసీ ఉమ్మడి పాస్ విధానాన్ని వెంటనే అమల్లోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. నెలవారీతో పాటు రోజువారీ పాస్‌లు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. హైదరాబాద్ బేగంపేట్‌లోని మెట్రో రైల్ భవన్‌లో హెచ్ఎంఆర్ఎల్, టీజీఎస్ఆర్టీసీ, విద్యుత్, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ శాఖల అధికారులతో సీఎస్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్రో--ఆర్టీసీ ఉమ్మడి పాస్ అమలుపై ప్రధానంగా చర్చించారు. మెట్రో, ఆర్టీసీ అధికారులు ఇప్పటికే ఉమ్మడి పాస్ జారీకి సాంకేతికంగా సిద్ధంగా ఉన్నామని సీఎస్‌కు వివరించారు. ఎల్అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైల్, ఆర్టీసీ అధికారులు ఏ రోజైనా విధానాన్ని అమలు చేసేలా ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. ఉమ్మడి చార్జీలను త్వరితగతిన ఖరారు చేసి, పాస్ విధానాన్ని వెంటనే అమల్లోకి తీసుకురావాలని సీఎస్ ఆదేశించారు.

## కాళేశ్వరం మీద లక్షలాది మందితో కేసీఆర్ ఉద్యమం

- హరీశ్ రావు



హైదరాబాద్, సెప్టెంబర్ 06: కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల పాలన పూర్తయిన సందర్భంగా ఈ రోజు రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారు. ఈ ప్రభుత్వం అన్ని వర్గాలను కూడా మోసం చేసిందన్నారు మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్. బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.అనంతరం హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, రైతులను, మహిళలను, మహిళలను, గిరిజనులను, బలహీన వర్గాలను కాంగ్రెస్ పార్టీ తీరని ద్రోహాన్ని తలపెట్టింది. ఈ శాసనసభ సమావేశాలు కనీసం నెల రోజులు నడపాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన బీఏసీ సమావేశంలో డిమాండ్ చేయాలని కూడా ఈ రోజు నిర్ణయించడం జరిగింది. ఏయే అంశాల మీద మాట్లాడాలనే దానిపై బీఆర్ఎస్ శాసన సభ్యులు, మండలి సభ్యులకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారన్నారు.ముఖ్యంగా కాళేశ్వరం జలాల విషయంలో అవకాశం ఉన్నా కూడా కాళేశ్వరం జలాలు ఎత్తకుండా ఈ రాష్ట్ర రైతాంగానికి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ద్రోహం మీద గట్టిగా నిలదీయాలని నిర్ణయించామన్నారు హరీశ్ రావు. అదే విధంగా పాలమూరు ఎత్తివేతల పథకం కేసీఆర్ దాదాపు 80 శాతం పని పూర్తి చేస్తే.. థర్డ్ ప్యాకేజీలో చిన్న పని పూర్తి చేస్తే..దాదాపు 50-60 టీఎంసీల రిజర్వాయర్లను నింపుకునే అవకాశ ముంది. కానీ పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు జరుపకపోవడం వల్ల ఈ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని కూడా శాసనసభలో నిలదీయాలని నిర్ణయించుకోవడం జరిగిందని హరీశ్ రావు వెల్లడించారు.

## జర్నలిస్టుల సమస్యలపై పోరాడుతాం




- సమాజ సమస్యల పరిష్కారంలో వారధిగా పనిచేయాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 06: మంజీర మెరుపు జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామని మెదక్ జిల్లా చిన్నశంకరంపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సందిగారి చంద్రంగౌడ్ అన్నారు. జర్నలిస్టు డే సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని శ్రీగోకులంలో ఆలయ ఛైర్మన్ పూలపల్లి యాదగిరి ఆధ్వర్యంలో జర్నలిస్టులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చంద్రం గౌడ్ మాట్లాడుతూ సమాజంలోని సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు వాటి పరిష్కారానికి ప్రజలు, అధికారుల మధ్య జర్నలిస్టులు వారధిగా పనిచేస్తు న్నారని పేర్కొన్నారు. పేదల పక్షాన నిలుస్తూ వారి సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగాన్ని కదిలించేలా ప్రతి జర్నలిస్టు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షుడు వెంకన్నబాబు, ప్రధాన కార్యదర్శి కె.యాదగిరి, టీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి దుర్గం అంజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కిషన్ నాయక్ 50వ జన్మదిన వేడుకలు



హైదరాబాద్, సెప్టెంబర్ 06: గిరిజన ముద్దుబిడ్డ తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోతు కిషన్ నాయక్ 50వ జన్మదిన వేడుకలను హుస్నాబాద్, అక్కన్నపేట గిరిజన, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కేక్ కట్ చేసి కిషన్ నాయక్‌కు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లా డుతూ.. ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూనే ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కిషన్ నాయక్ కృషి చేస్తున్నారని తెలిపారు. గిరిజనుల అభ్యున్నతికి, పేదలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తూ సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ఎస్సీ, ఎస్టీలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఆయన ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం సర్వన నాయక్ వెంకటయ్య డిక్య నాయక్ గిరిజన సంఘాల నాయకులురాజు నాయక్ భూక్యా వీరన్న నాయక్,ధరావత్ తిరుపతి నాయక్ భూక్య తిరుపతి నాయక్ భూక్య మోతిలాల్ నాయక్ తిరుపతి నాయక్ తిరుపతి నాయక్ రామచంద్రనాయక్ జరుపుల మోహన్ నాయక్ నెహ్రు నాయక్ సత్యం నాయక్ శీను నాయక్ లాలూ నాయక్ సోములు నాయక్‌పాల్గొన్నారు.

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

## అమెరికాలో ప్రమాదానికి గురైన

# అమెజాన్ ఎయిర్ కార్గో ఫ్లైట్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 06:** అమెరికాలో ఓ కార్గో ఫ్లైట్ ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో అయిదుమంది దుర్మరణం పాలయ్యారు. ఈకామర్స్ దిగ్గజం అమెజాన్ ప్రైమ్ ఎయిర్‌కు చెందిన విమానం అది. ల్యాండింగ్ సమయంలో అదుపు తప్పింది. సమాచారం అందిన వెంటనే భద్రత సిబ్బంది, ఎమర్జెన్సీ సర్వీస్ అధికారులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదం నేపథ్యంలో పౌర విమాన రాకపోకలకు అంతరాయం కలిగింది.ఫ్లోరిడా మయామి అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అమెజాన్ ప్రైమ్ ఎయిర్ కు చెందిన బోయింగ్ 767-300 రకానికి చెందిన విమానం ప్యూర్టోరికోలోని సాన్ జువాన్ సిటీ నుండి మయామికి బయలుదేరింది. అక్కడి కాలమానం ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం సుమారు 2 గంటల ప్రాంతంలో మయామి ఎయిర్ పోర్ట్ కు చేరుకుంది. ల్యాండింగ్ సమయంలో అదుపు తప్పింది. రన్‌వేపై నుంచి పక్కకు దూసుకెళ్లింది. అక్కడ పార్క్ చేసి ఉన్న అనేక ఇతర వాహనాలను



ఢీకొట్టింది.ఈ తాకిడితో ఫ్లైట్ ఫ్యూయల్ ట్యాంక్ ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలిపోయింది. ఉవ్వెత్తున మంటలు ఎగిశాయి. నల్లటి పొగ ఆకాశాన్ని కమ్మేసింది. విమానాశ్రయం సమీపంలో ఉన్న ప్రజలు తీవ్ర గందరగోళం, భయాందోళనలకు గురయ్యారు. ప్రమాదం సంభవించిన నిమిషాల్లోనే దాదాపు 60 రెస్క్యూ యూనిట్లకు చెందిన మయామి డేడ్ ఎమర్జెన్సీ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేయడానికి తీవ్రంగా శ్రమించారు.ఈ అగ్నిప్రమాదం కారణంగా విమానాశ్రయంలోని అన్ని రన్‌వేలలో కూడా విమానాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ ఘటనపై అమెజాన్ యాజమాన్యం స్పందించింది. అవేదన వ్యక్తంచేసింది. ప్రస్తుతం ఈ ప్రమాదానికి గల పూర్తి వివరాలను సేకరిస్తున్నామని అమెజాన్ అధికార ప్రతినిధి కెల్లీ నాంటెల్ తెలిపారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలతో సహా అందరికీ సహాయసహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

ఈ ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను తెలుసుకోవడానికి అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ విచారణ చేపట్టింది. నేషనల్ ట్రాన్స్ పోర్ట్ సెక్యూరిటీ బోర్డ్ అధికారులు కూడా సంఘటనా స్థలాన్ని పరిశీలిం చారు. విమానం బ్లాక్ బాక్స్, ఇతర సమాచారాన్ని సేకరిస్తోన్నారు. ల్యాండింగ్ సమయంలో వాతావరణ ప్రభావం ఉందా లేక సాంకేతిక వైఫల్యం ఉందా అనే కోణంలో దర్యాప్తు సాగిస్తోన్నారు.

## ఇస్రోను ప్రైవేటీకరించం..

- స్పష్టతనిచ్చిన స్పేస్ ఏజెన్సీ



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రైవేటీకరణపై వస్తున్న ఊహాగానాల్ని ఆ సంస్థ తోసిపుచ్చింది. 'భారత అంతరిక్ష ప్రయోగాల్లో ఇస్రో ప్రాధాన్యత తగ్గించటం, భవిష్యత్తులో సంస్థను ప్రైవేటీకరించటం జరుగదని స్పష్టం చేస్తున్నాం' అని ఇస్రో ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని పెంచాలన్న ప్రభుత్వ ప్రయత్నం, ఇస్రో ప్రాధాన్యతను తగ్గించటం కాదని, సంస్థను ప్రైవేటీకరించటంగా భావించరాదని స్పష్టం చేసింది.ఈ మార్పు వల్ల ఇస్రో సరికొత్త మిషన్లపై దృష్టి సారిస్తుండగా, పరిశ్రమలు అభివృద్ధి చెందిన వ్యవస్థలను విస్తరించడానికి వీలవుతుందని తెలిపింది. అధునాతన అంతరిక్ష పరిశోధన, సాంకేతిక అభివృద్ధి, వ్యూహాత్మక మిషన్లు, అన్వేషణలో ఇస్రో తన పాత్రను కొనసాగిస్తుందని సంస్థ పేర్కొన్నది. లాంచ్ వెహికల్స్, ఉపగ్రహాలు, ఇతర అంతరిక్ష వ్యవస్థల తయారీలో ప్రైవేట్ కంపెనీల పాత్ర పెంచాలన్న కేంద్రం ప్రణాళికలపై ఇస్రో సైంటిస్టులు, ఇతర ఉద్యోగుల్లో ఆందోళనలు మొదలయ్యాయి.

# లక్ష మందితో పాదయాత్ర

**హైదరాబాద్, సెప్టెంబర్ 06:** తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టుల అంశాన్ని మరోసారి ప్రధాన రాజకీయ అస్త్రంగా మలుచుకునేందుకు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సిద్ధమవుతున్నారు. త్వరలోనే నీళ్ల కోసం భారీ పాదయాత్ర చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.రాష్ట్రంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితిని ప్రజలకు వివరించేందుకు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించాలని కేసీఆర్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టుల వద్దకు వెళ్లనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ రెండు ప్రాజెక్టులను ప్రజలతో కలిసి సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలిస్తామని తెలిపారు.ఈ సందర్భంగా లక్ష మందితో పాదయాత్ర చేపడతామని కేసీఆర్ స్పష్టం చేశారు. భారీ సంఖ్యలో ప్రజలను సమీకరించి రెండు ప్రాజెక్టుల వద్దకు వెళ్లి ప్రభుత్వాన్ని నిలదీస్తామని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై ప్రజలకు వాస్తవాలను వివరించడంతో పాటు, ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడమే లక్ష్యంగా ఈ





కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలుస్తోంది.కాళేశ్వరం ప్రాజెక్టు ఇప్పటికే తెలంగాణ రాజకీయాల్లో కీలక అంశంగా మారింది. ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణ, ప్రస్తుత పరిస్థితి, నీటి వినియోగం తదితర అంశాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య గత కొంతకాలంగా తీవ్ర విమర్శలు కొనసాగుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం పలు ఆరోపణలు చేస్తుండగా.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టును సక్రమంగా నిర్వహించడం లేదని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు. మరోవైపు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కూడా ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాంత రైతులకు కీలకమైన ప్రాజెక్టుగా ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారా దక్షిణ తెలంగాణలోని పలు ప్రాంతాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులను ఒకేసారి రాజకీయ పోరాటానికి వేదికలుగా మార్చాలని కేసీఆర్ నిర్ణయించడం ప్రాధాన్యం సంతరించుకుంది.ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ఇప్పటికే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశానిర్దేశం చేసిన విషయం తెలిసిందే. అసెంబ్లీ, శాసనమండలి సమావేశాలకు ప్రతి ఒక్కరూ హాజరై ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించాలని సూచించారు. ఇప్పుడు అసెంబ్లీ వేదికతో పాటు క్షేత్రస్థాయిలోనూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు భారీ కార్యక్రమాన్ని చేపట్టాలని కేసీఆర్ నిర్ణయించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.లక్ష మందితో చేపట్టనున్న పాదయాత్ర ద్వారా సాగునీటి ప్రాజెక్టుల అంశాన్ని రాష్ట్రవ్యాప్తంగా చర్చకు తీసుకురావాలని బీఆర్ఎస్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. రైతులు, సాగునీటి సమస్యలను ఎదుర్కొంటున్న ప్రాంతాల ప్రజలను కార్యక్రమంలో భాగస్వామ్యం చేసే అవకాశం ఉంది. అయితే పాదయాత్ర ఎప్పుడు ప్రారంభమవుతుంది, ఏ మార్గంలో కొనసాగుతుంది, ఎక్కడి నుంచి ఎక్కడి వరకు నిర్వహిస్తారనే పూర్తి వివరాలను పార్టీ త్వరలో వెల్లడించే అవకాశం ఉంది. కేసీఆర్ తాజా ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి సాగునీటి ప్రాజెక్టుల అంశం వేడెక్కే అవకాశం కనిపిస్తోంది. భారీ సంఖ్యలో ప్రజలతో ప్రాజెక్టులను సందర్శించి ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన ప్రకటించడంతో.. రాబోయే రోజుల్లో కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు మరింత ముదిరే అవకాశం ఉంది.



# ట్రాన్స్‌జెండర్ల పేరిట బలవంతపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు:



డీజీపీ సీవీ ఆనంద్

**హైదరాబాద్, సెప్టెంబర్ 06:** ట్రాన్స్‌జెండర్ల పేరిట బలవంతపు వసూళ్లు, బెదిరింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరించారు. గృహప్రవేశాలు, వివాహాలు, ఇతర శుభకార్యాల సందర్భంగా కొందరు ట్రాన్స్‌జెండర్ల సమూహాలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు వస్తున్న ఫిర్యాదులపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఇలాంటి వసూళ్లు, బెదిరింపులు, యాచక ముఠాల ఆగడాలను అరికట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అన్ని పోలీస్ కమిషనర్లను డీజీపీ ఆదేశించారు. ప్రజలను బెదిరించడం, బలవంతంగా డబ్బులు వసూలు చేయడం వంటి చర్యలను ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. ఇటీవల హైదరాబాద్‌లోని చింతల్ ప్రాంతంలో ఓ కుటుంబం కొత్త ఇంట్లో గృహప్రవేశం నిర్వహిస్తుండగా కొందరు ట్రాన్స్‌జెండర్లు అక్కడికి చేరుకుని రూ.50 వేల ఇవ్వాలని డిమాండ్ చేసిన ఘటన కలకలం రేపింది. అంత మొత్తం ఇవ్వలేమని బాధితులు చెప్పడంతో వారితో అసభ్యంగా మాట్లాడటమే కాకుండా హంగామా సృష్టించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పోలీస్ శాఖ అప్రమత్తమైంది.తాను గతంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ఉన్న సమయంలోనూ ఇలాంటి బలవంతపు వసూళ్లపై చర్యలు తీసుకున్నామని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఘటనలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ట్రాన్స్‌జెండర్లను సమాజంలో గౌరవప్రదమైన స్థానం కల్పిస్తూ ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడానికి తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని డీజీపీ పేర్కొన్నారు. ట్రాఫిక్ మార్షల్స్‌తో పాటు హైడ్రా విధుల్లోనూ ట్రాన్స్‌జెండర్లకు అవకాశాలు కల్పించామని, ఈ బాధ్యతలు చేపట్టిన పలువురు సమర్థవంతంగా పనిచేస్తూ మంచి పేరు సంపాదిస్తున్నారని తెలిపారు. అయితే కొందరు వ్యక్తులు బలవంతపు వసూళ్లు, బెదిరింపులు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం వల్ల మొత్తం ట్రాన్స్‌జెండర్ సమాజానికే చెడ్డపేరు వస్తోందని డీజీపీ ఆవేదన వ్యక్తం చేశారు.చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ప్రజలను వేధించే వారిపై కేసులు నమోదు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీవీ ఆనంద్ హెచ్చరించారు. ప్రజలు ఇలాంటి ఘటనలు ఎదురైతే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

## బీఆర్ఎస్,నేతలతో కేసీఆర్ భేటీ -

### రాజీనామా, బస్సు యాత్ర పై కీలక నిర్ణయం..!?

**హైదరాబాద్, సెప్టెంబర్ 06:** తెలంగాణ రాజకీయాలు ఆసక్తి కరంగా మారు తున్నాయి. అధికార కాంగ్రెస్ లో తాజా పరిణామాలు.. నిర్ణయాల పైన భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కాంగ్రెస్ పరిణామాలతో బీఆర్ఎస్, బీజేపీ నేతలు కొత్త వ్యూహాలు సిద్దం చేస్తున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ప్రణాళికలు సిద్దం చేస్తున్నాయి. తాజా పరిణామాల వేళ కేసీఆర్



కీలక భేటీకి నిర్ణయించారు. కేసీఆర్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్న వేళ.. సంచలన నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పార్టీ నేతల సమాచారం.తెలంగాణ తాజా పరిణామాలను తమకు అనుకూలంగా మలచుకోవాలని కేసీఆర్ భావిస్తున్నారు. అందులో భాగంగా ఒత్తిడిలో ఉన్న కాంగ్రెస్ నాయకత్వాన్ని మరింతగా ఫిక్స్ చేసే కార్యాచరణ కు రూపకల్పన చేస్తున్నారు. ఇప్పటికే కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా జీతాలు తీసుకుంటున్నారని.. ఆయన రాజీనామా డిమాండ్ తో కాంగ్రెస్ నిరసనలు ప్రారంభించారు. మహా ధర్నా నిర్వహణ దిశగా ఈ రోజు ముఖ్య నేతలు భేటీ నిర్వహిస్తున్నారు. ఇదే సమయంలో కేసీఆర్ అలర్ట్ అయ్యా రు. అసెంబ్లీ సమావేశాల వేళ పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో రేపు (ఆదివారం) భేటీ కానున్నారు. ఎర్రవెల్లిలో ఆదివారం మధ్యాహ్నం పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆయన భేటీ కానున్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టి వెయ్యి రోజులైనా.. హామీలు అమలు చేయకపోవడం, పాలనా వైఫల్యాలు, ప్రజా సమస్యలపై చర్చించనున్నారు. అదే విధంగా తన పైన సీఎం రేవంత్ చేస్తున్న వ్యాఖ్యలకు కేసీఆర్ కౌంటర్ యాక్షన్ ప్లాన్ ఫిక్స్ చేయనున్నారు. రాజీనామా డిమాండ్ పైన నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ఉద్యమ సమయంలో పలు మార్లు రాజీనామా ద్వారా కేసీఆర్ మరింత బలోపేతం అయ్యారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాజీనామా చేస్తే ఎలా ఉం టుందనే అంశం పైన పార్టీ నేతల అభిప్రాయాలు తీసుకోనున్నారు. ఇక.. కేసీఆర్ బస్సు యాత్రకు సిద్దం అవుతున్నారు. ఈ రెండు కీలక అంశాల పైన కేసీఆర్ ఈ భేటీలో స్పష్టత ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

## తెలంగాణా శాసనసభా పర్వం.. వ్యూహ ప్రతివ్యూహాలతో కాంగ్రెస్, బీఆర్ఎస్

**హైదరాబాద్, సెప్టెంబర్ 06:** తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలకు అధికార ప్రతిపక్ష పార్టీలు రెడీ అవుతున్నాయి. తెలంగాణా శాసన సభ సమావేశాలు రేపు ప్రారంభమవుతాయి. ఈ సమావేశాల్లో ప్రభుత్వం సభలో పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టనుంది. 21 ఏళ్లకే చట్ట సభలకు పోటీ చేసే అవకాశం కల్పించాలన్న ప్రతిపాదనతో పాటు.. క్యూర్, ల్యాండ్ పూలింగ్, 22ఏ భూములు, భూసేకరణ అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు శాసనసభ, మండలి వర్షాకాల సమావేశాలు సజావుగా సాగేందుకు అధికారులు సహకరించాలని, సమన్వయంతో పనిచేయాలని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌లు సూచించారు. ధర్నాలు, రాస్తారోకోలు జరగకుండా ప్రశాంతంగా సమావేశాలు జరిగేలా చూడాలని, సమావేశాలు జరిగే సమయంలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండి మంత్రులకు, సభ్యులకు సహకరించాలని సూచించారు. ఈ మేరకు ప్రభుత్వం తరపున సహకారముంటుందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. శాసన సభ సమావేశాలు సజావుగా జరిగేలా, ప్రతిపక్షాలను నిలువరించేందుకు ముఖ్యమంత్రి, మంత్రులు, అధికార పక్ష సభ్యులు కూడా అన్ని విధాలా సన్నద్ధమవుతున్నారు. సభలో



ప్రభుత్వాన్ని పలు అంశాలపై నిలదీసేందుకు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కూడా వ్యూహాలతో సిద్ధమవుతున్నాయి. ఈ క్రమంలో సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో బీఆర్ఎస్ శాసనసభా పక్ష సమావేశం జరిగింది. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన ఈ కీలక భేటీ నిర్వహించబడింది. సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుతో పాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు.రేపటి నుండి ప్రారంభం అవుతున్న అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కేసీఆర్ నేతలతో విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వ విధానాలపై, ప్రజా సమస్యలపై ఎలా స్పందించాలనే అంశాలపై ఎమ్మెల్యేలకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. పార్టీ కార్యాచరణను మరింత బలోపేతం చేసుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా ఆయన సలహాలు అందించారు. ఈ సమావేశం ద్వారా బీఆర్ఎస్ శాసనసభా పక్షం ఐక్యంగా ముందుకు సాగాలని, ప్రజల సమస్యలను ప్రభావ వంతంగా లేవనెత్తాలని కేసీఆర్ సూచించినట్లు తెలిసింది. సమావేశం అనంతరనాయకులు తమ తమ నియోజక వర్గాల్లో కార్యాచరణను ముమ్మరం చేయనున్నారు.

# రైతన్నకు ఇదేం దుస్థితి?

## మూడు యూరియా బస్తాల కోసం 15 రోజుల పైరవీ..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

యూరియా కొరత లేదని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో రైతులు మాత్రం యూరియా కోసం నానా అవస్థలు పడుతున్నారని రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఓ రైతు అనుభవం చెబుతోంది. నాలుగు యూరియా బస్తాల కోసం నెల రోజులుగా తిరిగిన ఓ రైతు.. చివరకు మూడు బస్తాలు దొరకడానికి కూడా 15 రోజుల పాటు పైరవీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రాజన్న సిరిసిల్ల జిల్లా నర్సింహులపల్లి గ్రామానికి చెందిన వెల్పుల నర్సయ్యకు సుమారు రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. పంట సాగు కోసం నాలుగు యూరియా బస్తాలు అవసరం కాగా, నెల రోజులుగా వాటి కోసం ప్రయత్నిస్తున్నా అందుబాటులోకి రాలేదు. చదువు లేకపోవడం, ఆండ్రాయిడ్ ఫోన్ లేకపోవడంతో యాప్‌లో స్వయంగా యూరియా బుక్ చేసుకునే పరిస్థితి కూడా ఆయనకు లేదు. దీంతో తనకు యూరియా ఇప్పించాలని బంధువులను ఆశ్రయించారు. వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించినప్పటికీ యాప్‌లో స్టాక్ లేదని, రెండు రోజుల తర్వాత రావాలని సూచించారు. తిరిగి వెళ్లిన సమయంలో కొద్దిసేపటికే యూరియా స్టాక్ పూర్తయిందని యాప్‌లో చూపించడంతో రైతు నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది.

చివరకు పరిచయస్తుల సహాయంతో ఎల్లారెడ్డిపేట ప్రాంతంలో అందుబాటులో ఉన్న మూడు యూరియా బస్తాలను చేబదులు తీసుకుని



ఆటోలో తెచ్చుకున్నారు. నాలుగు బస్తాలు అవసరం ఉండగా మూడు మాత్రమే దొరకడంతో వాటితోనే ప్రస్తుతం సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

"గతంలో సుట్టం ఇంటికి వస్తే బువ్వ పెట్టేవాళ్లు.. అవసరమైతే మందు బస్తా కూడా ఇచ్చేవాళ్లు. ఇప్పుడు యూరియా బస్తా అడిగితే దొరకడం లేదు. బంగారమైనట్టుగా మారిపోయింది" అంటూ రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారని కథనం పేర్కొంది.

యూరియాను పూర్తిగా యాప్ ఆధారంగా పంపిణీ చేయడం వల్ల సాంకేతిక పరిజ్ఞానం లేని చిన్న, సన్నకారు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాప్‌లోనే కాకుండా ఎరువుల దుకాణాల్లో కూడా కొంత మేరకు యూరియాను అందుబాటులో ఉంచి, ఎంఆర్‌పీ ధరలకు విక్రయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల యూరియా కష్టాలపై దృష్టి సారించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ముందస్తు ప్రణాళికతో సరిపడా యూరియాను అందుబాటులో ఉంచి, రైతులకు సకాలంలో ఎరువు అందేలా చూడాలని కోరుతున్నారు.

రైతు లేనిదే రాజ్యం లేదని, కంప్యూటర్లు, యాప్‌లు ఎంత అభివృద్ధి చెందినా ప్రజలకు అన్నం పెట్టేది రైతేనని రైతు సమస్యలపై స్పందించిన వారు పేర్కొన్నారు. యూరియా కొరతను వెంటనే పరిష్కరించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని డిమాండ్ చేశారు.

# హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

### 6 గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలి

### ఇంటింటికీ 'బాకీ కార్డుల' పంపిణీ.. మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్

నవతెలంగాణ-సిరిసిల్ల:

అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్ ఆరోపించారు. సిరిసిల్ల పట్టణంలోని 34వ వార్డు బీఆర్ఎస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికీ 'బాకీ కార్డుల' పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా దార్ల సందీప్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గుర్తు చేసేందుకే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'బాకీ కార్డులు' పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం



వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకుంటున్నా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు.

మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, విద్యార్థులు, యువత, రైతులు, చేనేత కార్మికులు సహా వివిధ వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు హామీల అమలుపై ఒత్తిడి తీసుకురావడమే లక్ష్యంగా 'బాకీ కార్డుల' కార్యక్రమాన్ని చేపట్టినట్లు దార్ల సందీప్ తెలిపారు.

# సిరిసిల్లకు వస్తే అభివృద్ధి పనులతో రండి



### కనీసం ₹1,000 కోట్ల కొత్త అభివృద్ధి పనులకు నిధులు తీసుకురావాలి

### సీఎం రేవంత్ రెడ్డికి ఎల్లారెడ్డిపేట మండల యువత డిమాండ్

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్లకు వస్తున్న నేపథ్యంలో కేవలం రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా, నియోజకవర్గ అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేసి రావాలని ఎల్లారెడ్డిపేట మండల యువత డిమాండ్ చేసింది. సిరిసిల్ల, సిద్దిపేట ప్రాంతాలకు వస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తాము స్వాగతిస్తున్నామని యువజన నాయకులు తెలిపారు. ముఖ్యమంత్రిగా రాష్ట్రంలోని ఏ ప్రాంతానికైనా వెళ్లే హక్కు ఆయనకు ఉందని, అయితే సిరిసిల్లకు వచ్చినప్పుడు కనీసం రూ.1,000 కోట్ల విలువైన కొత్త అభివృద్ధి పనులకు నిధులు తీసుకురావాలని కోరారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి సిరిసిల్ల ఎమ్మెల్యే, మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో సాగునీటి ప్రాజెక్టులు, చెక్‌డ్యామ్‌లు, అప్పర్ మానేరు, రహదారులు, బైపాస్ రోడ్డు, మెడికల్ కాలేజీ, అగ్రికల్చర్ కాలేజీ, యూనివర్సిటీ తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు యువజన నాయకులు పేర్కొన్నారు. సిరిసిల్లకు కొత్త పరిశ్రమలు, ఉద్యోగ అవకాశాలు, విద్యాసంస్థలు, రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన అభివృద్ధి పనులను పూర్తి చేయడంతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టబోయే కొత్త పనులపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు.

"సిరిసిల్లకు వచ్చి సభ నిర్వహించి రాజకీయ విమర్శలు చేసి వెళ్లిపోవడం కాదు.. పనులతో రండి.. నిధులతో రండి.. అభివృద్ధితో రండి" అని యువత స్పష్టం చేసింది. సిరిసిల్ల అభివృద్ధికి సంబంధించి గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనుల వివరాలతో కూడిన అభివృద్ధి పుస్తకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేస్తామని యువజన నాయకులు తెలిపారు. దాన్ని పరిశీలించి, ప్రస్తుత ప్రభుత్వం చేపట్టబోయే కొత్త అభివృద్ధి పనుల జాబితాను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో యువజన నాయకులు సింగారం దేవరాజ్, అజ్మీర తిరుపతి నాయక్, అందే సురేష్, సింగారం మధు, ములిగి ప్రమోద్, మందాటి రాము, నిమ్మల బాబు, ఎనగందుల గణేష్, సంతోష్ నాయక్, సాయిచంద్, చింతల రాజు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ ప్రభుత్వం





### కాంగ్రెస్ మండల అధ్యక్షులు మునిగెల రాజు

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

నిరుపేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తూ, పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముందుకు సాగుతోందని కాంగ్రెస్ మండల అధ్యక్షులు మునిగెల రాజు అన్నారు. గోపాల్రావుపల్లె, అంకుషపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్పొరేట్ వైద్యం చేయించుకోలేని నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ పథకం కొండంత అండగా నిలుస్తోందని నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని మునిగెల రాజు అన్నారు. ప్రజా ప్రభుత్వంలో అవకతవకలకు తావులేకుండా, సంక్షేమ ఫలాలు అర్హులకు పారదర్శకంగా అందేలా నాయకత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం, గ్రామ సర్పంచ్ ప్రేమ్, శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు పొన్నాల పరశురాములు, ఇట్టిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఆరేపల్లి బాలు, లింగాల భూపతి, బండి పరశురాం, ప్రశాంత్, తిరుపతి, మిరాల శ్రీనివాస్, రవి, లక్ష్మణ్, రాజేశం, వెంకటరెడ్డి, సారయ్య, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# కాలనీ సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి

### మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి

బలగం టీవీ, సిరిసిల్ల:

శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ సొసైటీ–సిరిసిల్ల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధిలో వెల్ఫేర్ సొసైటీలు కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. మౌలిక వసతుల పరిరక్షణతో పాటు కాలనీ ప్రజల సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతోనే కాలనీ మరింత అభివృద్ధి చెందుతుందని, మున్సిపాలిటీ తరఫున ప్రజలకు అవసరమైన సహకారం అందించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు కాలనీ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా సేవలందించాలని ఆకాంక్షించారు.

శ్రీనగర్ కాలనీలో వివిధ సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ ఇతర వెల్ఫేర్ సొసైటీలకు ఆదర్శంగా నిలవాలని ఆమె సూచించారు. గతంలో కాలనీ ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. వినాయక నిమజ్జనం, రాబోయే పండుగలను దృష్టిలో ఉంచుకుని కాలనీలో గుంతలు ఉన్న ప్రాంతాల్లో మొరంతో చదును చేయడంతో పాటు అవసరమైన చోట్ల డ్రైనేజీ వ్యవస్థ కోసం



సీసీ పైపులను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని వెల్లడించారు.

అనంతరం శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ సొసైటీ నూతన అధ్యక్షుడు నవీన్‌తో పాటు కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా కౌన్సిలర్ వేముల రాములు, బీఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల శాఖ అధ్యక్షుడు జిందం చక్రపాణి, శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ సొసైటీ నూతన అధ్యక్షుడు నవీన్, కార్యవర్గ సభ్యులు, సొసైటీ సభ్యులు, కాలనీ ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కమాన్‌పూర్ విద్యార్థిని ఆనందికి స్వర్ణ పతకాలు

### 400, 200 మీటర్ల విభాగాల్లో ప్రతిభ

### పాండిచ్చేరి సౌత్ జోన్ నేషనల్ మీట్‌కు ఎంపిక

బలగం టీవీ, హైదరాబాద్

పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన నల్లవెల్లి శంకర్ - భారతిల రెండో కుమార్తె ఆనంది రాష్ట్రస్థాయి పరుగు పందెంలో బంగారు పతకాలను సాధించి సత్తా చాటింది. ప్రస్తుతం ఆనంది గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది.

హనుమకొండలోని జేఎన్ఎం స్టేడియంలో నిర్వహించిన 12వ తెలంగాణ స్టేట్ మీట్ సౌత్ జోన్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ అండర్-18 విభాగంలో ఆనంది పాల్గొంది. ఈ పోటీల్లో 400 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందెం విభాగాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి రెండు బంగారు పతకాలను కైవసం చేసుకుంది.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక: రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించిన ఆనంది, సెప్టెంబర్ నెలలో పాండిచ్చేరిలో జరగనున్న సౌత్ జోన్ నేషనల్ మీట్‌కు ఎంపికైంది. ప్రతిభ చూపిన విద్యార్థినిని తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటేశ్వర్ రెడ్డి, కోచ్ సుబ్బారావు ప్రత్యేకంగా అభినందించారు.



# కాంగ్రెస్ నిర్లక్ష్యంతో అధ్వానంగా తెలంగాణ పల్లెలు

### పారిశుధ్యం పడకేసింది.. నిధులు విడుదల చేయడం లేదు

### కేసీఆర్ పాలనలోనే గ్రామాల సువర్ణయుగం:

### ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ధ్వజమెత్తు

బలగం టీవీ, కోరుట్ల

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ పల్లెలు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అధ్వాన స్థితికి చేరుకున్నాయని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలోని ఐలాపూర్ గ్రామంలో పల్లెల విద్యాభివృద్ధి, పడకేసిన పారిశుధ్యానికి నిరసనగా ఆయన ఆధ్వర్యంలో ఆదివారం పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార కాంగ్రెస్ వైఫల్యాలను, గ్రామ స్వరాజ్యం పట్ల చూపుతున్న నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఎండగట్టారు.

దేశంలో దాదాపు 6.5 లక్షల గ్రామాలు ఉంటే, నాడు కేసీఆర్ పాలనలో కేంద్రం ప్రకటించిన 40 ఉత్తమ గ్రామాల అవార్డుల్లో ఏకంగా 13 అవార్డులు (33 శాతం) తెలంగాణకే దక్కాయని ఆయన గుర్తుచేశారు. 'పల్లె ప్రగతి' ద్వారా ప్రతి పంచాయతీకి ట్రాక్టర్, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, వైకుంఠ ధామాలను ఏర్పాటు చేసి పరిశుభ్రతకు పెద్దపీట వేశామన్నారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రూపాయి నిధులు కూడా విడుదల చేయకపోవడంతో పల్లె ప్రకృతి వనాలు ఎండిపోయి, పారిశుధ్యం పూర్తిగా లోపించిందని ఆవేదన వ్యక్తం చేశారు.

420 హామీలతో అధికారంలోకి వచ్చారు: గతంలో నాటిన 250 కోట్ల మొక్కలను సంరక్షించాల్సింది పోయి, అభివృద్ధి పేరిట చెట్లను విచక్షణారహితంగా నరికివేస్తున్నారని ఎమ్మెల్యే సంజయ్ ఆరోపించారు. 420 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ తక్షణమే పింఛన్లు అందజేయాలని, అలాగే పంచాయతీలకు నిధులు విడుదల చేసి పల్లెలను కాపాడాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, మండల అధ్యక్షుడు నత్తి రాజ్‌కుమార్, నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# వెల్గటూర్ క్రషర్‌లో విద్యుత్ షాక్‌తో మధ్యప్రదేశ్ యువకుడు మృతి

బలగం టీవీ, వెల్గటూర్

వెల్గటూర్ మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయ స్టోన్ క్రషర్‌లో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఒక యువకుడు శనివారం మృతి చెందాడు. మృతుడు మధ్యప్రదేశ్ రాష్ట్రం సైడోర్ జిల్లా గుర్తారా మండలం పటేర్‌టోలా గ్రామానికి చెందిన ఆదివాసీ యువకుడు రాహుల్ బైగా (21)గా పోలీసులు గుర్తించారు.

సమాచారం ప్రకారం, రాహుల్ బైగా వెల్గటూర్ గ్రామంలోని శ్రీ ఆంజనేయ క్రషర్‌లో పనిచేస్తున్నాడు. శనివారం రోజువారీ పనిలో భాగంగా క్రషర్‌లో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన అతడిని గమనించిన తోటి కార్మికులు వెంటనే చికిత్స నిమిత్తం లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, వైద్యులు పరీక్షించి అతడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

పోలీసుల దర్యాప్తు: మృతుడి సోదరుడు చోటు బైగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్గటూర్ ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు. ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని, ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు జరుపుతున్నామని ఆయన పేర్కొన్నారు.



# అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

### ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం

### రామడుగు మండలంలో రూ.98.16 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బలగం టీవీ, రామడుగు

మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. రామడుగు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఆయన విస్తృతంగా పర్యటించి రూ.98.16 లక్షల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు, సంక్షేమ ఫలాలను లబ్ధిదారులకు అందజేశారు.

మొదటగా దేశరాజ్‌పల్లి గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనానికి, రూ.4.16 లక్షలతో చేపట్టనున్న విశ్వబ్రాహ్మణ సంఘ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం రామడుగు గ్రామంలో రూ.50 లక్షలతో నిర్మిస్తున్న మహిళా సమాఖ్య భవనానికి, రూ.24 లక్షలతో చేపడుతున్న ఈఆర్‌ఓ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రొసీడింగ్స్‌ను, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.

మహిళా సాధికారతే లక్ష్యం: అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, రహదారుల అభివృద్ధి ద్వారా ప్రజా రవాణాను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. మహిళా స్వశక్తి సంఘాలను బలోపేతం చేస్తూ, ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆశయానికి అనుగుణంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమంలో భాగంగా, ఇప్పటివరకు బ్యాంకుల ద్వారా రూ.26 వేల కోట్ల వడ్డీలేని రుణాలను అందించామని గుర్తుచేశారు. రామడుగు మండలాన్ని అన్ని రంగాల్లో మోడల్‌గా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వరి, తహసీల్దార్ రాజమల్లయ్య, ఎస్సై రాజు, ఏఎంసీ చైర్మన్ తిరుమల తిరుపతి, రామడుగు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జవ్వాజి హరీష్, సింగిల్ విండో చైర్మన్ కోల రమేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు మరియు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు



# తిలక్ వర్మ - వైభవ్ సూర్యవంశీ మధ్య వాగ్వాదం

**15 ఏళ్ల వైభవ్ పై స్లెడ్జింగ్‌కు దిగిన సౌత్ జోన్ కెప్టెన్**

**అంపైర్ల జోక్యంతో సద్దుమనిగిన వివాదం**

బలగం టీవీ, హైదరాబాద్

దులీప్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్, సౌత్ జోన్ ఆటగాళ్ల మధ్య మైదానంలో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈస్ట్ జోన్ యువ బ్యాటర్, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ, సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మల మధ్య చోటుచేసుకున్న ఈ వివాదం మైదానంలో ఉద్రిక్తతకు దారితీసింది.

ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్ 11వ ఓవర్లో ఈ సంఘటన జరిగింది. తిలక్ వర్మ వైభవ్ సూర్యవంశీ వైస్ కెప్టెన్సీని ఉద్దేశించి స్లెడ్జింగ్ చేయడం ప్రారంభించాడు. మాటమాట పెరిగి తిలక్ వర్మ, వైభవ్ వైపు వెళ్తూ అసహనం వ్యక్తం చేయగా, వైభవ్ కూడా వెనక్కి తగ్గకుండా ఎదురు సమాధానమిచ్చాడు. ఇద్దరి మధ్య వివాదం ముదరడంతో వెంటనే అంపైర్లు జోక్యం చేసుకుని సర్దిచెప్పి ఆటగాళ్లను విడదీశారు.

బ్యాటింగ్‌లో వైభవ్ మెరుపులు: ఈ వివాదానికి ముందే వైభవ్ సూర్యవంశీ మైదానంలో ధనాధన్ బ్యాటింగ్‌తో చెలరేగాడు. ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్‌తో కలిసి తొలి వికెట్‌కు 100 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. వైభవ్ కేవలం 37 బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 44 పరుగులు చేసి చామ మిలింద్ బౌలింగ్‌లో తానయ్ త్యాగరాజన్‌కు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. ఈ టోర్నీ సెమీఫైనల్లో (92, 40) రాణించిన వైభవ్, ఫైనల్లోనూ తన ఫామ్‌ను కొనసాగించాడు.

ఆ తర్వాత వైభవ్ సూర్యవంశీ ఆఫ్ఘనిస్థాన్‌తో జరగనున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత జట్టు తరఫున బరిలోకి దిగనున్నాడు. ఈ సిరీస్‌లోని మొదటి మ్యాచ్ సెప్టెంబర్ 13న ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరగనుంది.



# ట్రోఫీ ప్రదానంపై మళ్లీ ఉత్కంఠ!

**వరుస విజయాలతో దూసుకెళ్తున్న హర్మన్‌ప్రీత్ సేన**

**ఏసీసీ అధ్యక్షుడు మొహ్సిన్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ స్వీకరణపై సస్పెన్స్**

బలగం టీవీ, దుబాయ్

మహిళల టీ20 ఆసియా కప్ 2026లో హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత జట్టు అదరగొడుతోంది. వరుసగా మూడు విజయాలు సాధించిన టీమిండియా లీగ్ దశలోనే అధికారికంగా సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. భారత జట్టు ఉన్న ఫామ్‌ను చూస్తుంటే టైటిల్ గెలిచేందుకు ప్రధాన పోటీదారుగా కనిపిస్తుండగా, సెప్టెంబర్ 13న దుబాయ్ అంతర్జాతీయ స్టేడియంలో జరగనున్న ముగింపు వేడుకలపై క్రీడా ప్రపంచంలో ఆసక్తికర చర్చ జరుగుతోంది.

ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) అధ్యక్షుడిగా, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఛైర్మన్‌గా ఉన్న మొహ్సిన్ నఖ్వీ ఈ ఫైనల్ పోరుకు ముఖ్య అతిథిగా హాజరై ఛాంపియన్ జట్టుకు ట్రోఫీని అందజేయనున్నారు. అయితే, ఒకవేళ భారత మహిళల జట్టు ఫైనల్‌కు చేరి టైటిల్ సాధిస్తే నఖ్వీ చేతుల మీదుగా విజేత ట్రోఫీని స్వీకరిస్తుందా లేదా అన్నదానిపై సస్పెన్స్ నెలకొంది.

గత వివాదం మళ్లీ పునరావృతమవుతుందా?: గతేడాది పురుషుల టీ20 ఆసియా కప్ ఫైనల్లో సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని భారత జట్టు పాకిస్తాన్‌ను ఓడించి టైటిల్ గెలుచుకున్న సమయంలో, నఖ్వీ చేతుల మీదుగా విజేత ట్రోఫీని స్వీకరించేందుకు టీమిండియా నిరాకరించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఆటగాళ్లు కేవలం వ్యక్తిగత అవార్డులను మాత్రమే తీసుకుని ప్రధాన ట్రోఫీని నఖ్వీ నుండి తీసుకోలేదు. దాంతో కోపానికి గురైన నఖ్వీ ట్రోఫీని తీసుకుని వెళ్లిపోగా, అది ఇప్పటికీ ఏసీసీ ప్రధాన కార్యాలయంలోనే ఉంది. ఇప్పుడు మహిళల టోర్నీలోనూ భారత్ విజేతగా నిలిస్తే మళ్లీ అలాంటి ఘట్టమే రిపీట్ అవుతుందా అని క్రికెట్ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.



# విజువలీ ఇంపైర్డ్ విభాగాంలో భారత్‌కు రెండు పతకాలు ఖాయం

**వరల్డ్ ఆర్చరీ పారా సిరీస్:**

**కాంపౌండ్ విభాగంలో అగ్రస్థానంలో మెరిసిన శీతల్ దేవి**

**సెమీఫైనల్‌కు చేరుకున్న పురుషుల, మహిళల కాంపౌండ్ టీమ్‌లు**

బలగం టీవీ, హైదరాబాద్

వరల్డ్ ఆర్చరీ పారా సిరీస్ మూడో దశ పోటీల్లో భారత పారా ఆర్చర్లు తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. ఆదివారం జరిగిన రెండో రోజు పోటీల్లో విజువల్లీ ఇంపైర్డ్ 1 (VI1) విభాగంలో యుగళ్ గార్గ్, పవన్ కుమార్, తన్వి ఇంగాలే సెమీఫైనల్‌కు చేరుకోవడంతో భారత్‌కు కనీసం రెండు పతకాలు ఖాయమయ్యాయి.

మరోవైపు కాంపౌండ్ విభాగం క్వాలిఫికేషన్ రౌండ్‌లో ప్రపంచ నంబర్ 1, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ శీతల్ దేవి 720కి గానూ 698 పాయింట్లు సాధించి మహిళల విభాగంలో టాప్ సీడ్‌గా నిలిచింది. శీతల్ దేవితో పాటు లాల్‌పతీ, సరితలతో కూడిన భారత మహిళల కాంపౌండ్ టీమ్ 1,368 పాయింట్లతో చైనాను వెనక్కి నెట్టి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో నేరుగా సెమీఫైనల్ బెర్త్ దక్కించుకుని పతకానికి అడుగు దూరంలో నిలిచింది.

పురుషుల కాంపౌండ్ లోనూ జోరు: పురుషుల కాంపౌండ్ విభాగంలో ప్యారిస్ పారాలింపిక్స్ కాంస్య పతక విజేత రాకేష్ కుమార్ 702 పాయింట్లతో రెండో సీడ్‌గా, తోమన్ కుమార్ నాలుగో సీడ్‌గా నిలిచారు. 1,398 పాయింట్లతో భారత పురుషుల కాంపౌండ్ టీమ్ కూడా అగ్రస్థానంలో నిలిచి నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. మిక్స్‌డ్ కాంపౌండ్ విభాగంలో శీతల్ - తోమన్ జోడీ టాప్ సీడింగ్‌తో క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది.

VI1 విభాగంలో మూడో సీడ్ పవన్ కుమార్ 6-0తో పూజన గోవర్ధన్‌పై గెలిచి తన్వి ఇంగాలేతో ఆల్-ఇండియన్ సెమీఫైనల్ పోరుకు సిద్ధమయ్యాడు. మరో సెమీఫైనల్లో యుగళ్ గార్గ్ 6-0తో అర్నవ్ బైస్‌పై విజయం సాధించి సైప్రస్‌కు చెందిన ప్రపంచ నంబర్ 1 క్రిస్టోస్ మిసోస్‌తో తలపడనున్నాడు.

# సెంచరీతో చెలరేగిన ఇషాన్ కిషన్..

**తొలిరోజే ఈస్ట్ జోన్ కొండంత స్కోరు**

**కెప్టెన్ ఇషాన్ కిషన్ (111 నాటౌట్) భీకర శతకం**

**తొలి రోజు ఆట ముగిసేసరికి ఈస్ట్ జోన్ 385/4**

బలగం టీవీ, హైదరాబాద్

దులీప్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ బ్యాటర్లు పరుగుల వరద పారించారు. చిదంబరం స్టేడియంలో సౌత్ జోన్‌తో జరుగుతున్న టైటిల్ పోరులో ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్ (111 నాటౌట్: 120 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లు) బాధ్యతాయుత శతకంతో చెలరేగాడు. అతడికి తోడుగా టాపార్డర్ బ్యాటర్లు రాణించడంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ మొదటి ఇన్నింగ్స్‌లో 4 వికెట్ల నష్టానికి 385 పరుగుల భారీ స్కోరు సాధించింది.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఈస్ట్ జోన్‌కు ఓపెనర్లు అభిమన్యు ఈశ్వరన్ (72), వైభవ్ సూర్యవంశీ (44) తొలి వికెట్‌కు 100 పరుగుల భాగస్వామ్యంతో శుభారంభం అందించారు. అనంతరం శిఖర్ మోహన్ (85) వేగంగా పరుగులు సాధిస్తూ స్కోరు బోర్డును ముందుకు నడిపాడు. ఒక దశలో సుదీప్ కుమార్ ఘరమి (6) త్వరగానే నిష్క్రమించినా, క్రీజులోకి వచ్చిన కెప్టెన్ ఇషాన్ కిషన్, కుమార్ కుషగ్ర (63 నాటౌట్)తో కలిసి సౌత్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. శ్రేయాస్ గోపాల్ ఓవర్లో బౌండరీ బాది ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 10వ సెంచరీ పూర్తి చేసుకున్న ఇషాన్, ఇదే క్రమంలో ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 4,000 పరుగుల మైలురాయిని కూడా దాటాడు. వీరిద్దరూ ఐదో



వికెట్‌కు అజేయంగా 144 పరుగులు జోడించి జట్టును సురక్షిత స్థితిలో నిలిపారు.

స్కోరు వివరాలు (తొలి రోజు ముగిసే సమయానికి):

ఈస్ట్ జోన్ (తొలి ఇన్నింగ్స్): 385/4

ప్రధాన స్కోరర్లు: ఇషాన్ కిషన్ 111*, శిఖర్ మోహన్ 85, అభిమన్యు ఈశ్వరన్ 72, కుమార్ కుషగ్ర 63*, వైభవ్ సూర్యవంశీ 44.

సౌత్ జోన్ బౌలింగ్: మిలింద్ 2 వికెట్లు, త్రిపురన విజయ్ 1 వికెట్.

# చైనా మాస్టర్స్ విజేతగా సాత్విక్-చిరాగ్



**భారత్‌కు చారిత్రాత్మక టైటిల్**

**ఫైనల్లో చైనా జంటపై ఉత్కంఠ విజయం**

**కెరీర్‌లో 10వ బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ టైటిల్ సొంతం**

బలగం టీవీ, బీజింగ్

భారత స్టార్ బ్యాడ్మింటన్ జోడీ సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి కొత్త చరిత్ర సృష్టించారు. చైనా మాస్టర్స్ సూపర్ 750 టోర్నమెంట్‌లో తొలిసారిగా విజేతగా నిలిచి చారిత్రాత్మక టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. గతంలో 2023, 2025 లలో ఫైనల్ వరకు వెళ్లి రన్నరప్‌గా నిలిచిన ఈ జోడీ, ఈసారి చైనా గడ్డపై ఆతిథ్య జట్టును ఓడించి తమ చిరకాల కలను నెరవేర్చుకుంది.

పోటీల ఫైనల్ మ్యాచ్‌లో భారత జోడీకి ఆరంభంలో ఎదురుదెబ్బ తగిలింది. సొంత అభిమానుల మద్దతుతో చైనాకు చెందిన హే జి టింగ్, రెన్ జియాంగ్ యు ద్వయం దూకుడుగా ఆడి తొలి గేమ్‌ను 21-11 తేడాతో గెలుచుకుంది. అయితే ఓటమితో కుంగిపోకుండా పుంజుకున్న సాత్విక్-చిరాగ్ జంట, రెండో గేమ్‌లో నెట్ వద్ద వ్యూహాత్మకంగా ఆడి 21-13 తేడాతో గేమ్‌ను కైవసం చేసుకుని మ్యాచ్‌ను సమం చేసింది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో తీవ్ర ఒత్తిడిని అధిగమించి, గంటా 10 నిమిషాల పోరాటం తర్వాత 11-21, 21-13, 21-17 తేడాతో చైనా జోడీపై ఘనవిజయం సాధించింది.

సీజన్‌లో రెండో టైటిల్:

ఈ ఏడాది సింగపూర్ ఓపెన్ తర్వాత సాత్విక్-చిరాగ్ జోడీకి ఇది రెండో ప్రపంచ టూర్ టైటిల్. రాబోయే ఆసియా క్రీడలకు ముందు చైనా వేదికగా సాధించిన ఈ విజయం భారత క్రీడాకారుల ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచనుంది

# బంగ్లాదేశ్‌పై 3-0తో భారత్ ఘనవిజయం



**ఏఎఫ్‌సీ అండర్-20 ఏషియన్ కప్ క్వాలిఫైయర్స్: బ**

**మెరిసిన డానీ, విశాల్, అర్బాష్**

**అర్హత సాధించేందుకు వేచిచూడాల్సిందే!**

బలగం టీవీ, హైదరాబాద్

ఏఎఫ్‌సీ అండర్-20 ఏషియన్ కప్ క్వాలిఫైయర్స్‌లో భారత యువ ఫుట్‌బాల్ జట్టు (బ్లూ కోల్ట్స్) ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఆదివారం ఇక్కడ జరిగిన తమ చివరి గ్రూప్ మ్యాచ్‌లో భారత్ 3-0 తేడాతో చిరకాల ప్రత్యర్థి బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. ఈ విజయంతో భారత్ మూడు మ్యాచ్‌లలో ఆరు పాయింట్లతో టోర్నీని ముగించింది.

మొదటి నుంచి దూకుడుగా ఆడిన భారత్ మ్యాచ్ 25వ నిమిషంలో డానీ మైతేయ్ లైశ్రామ్ సాధించిన గోల్‌తో 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. అనంతరం రెండో అర్ధభాగంలో 60వ నిమిషంలో విశాల్ యాదవ్ ఆక్రోబాటిక్ ఫినిషింగ్‌తో అద్భుత గోల్ చేసి ఆధిక్యాన్ని 2-0కి పెంచాడు. ఆ తర్వాత 79వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన మహమ్మద్ అర్బాష్ శక్తివంతమైన షాట్‌తో మూడో గోల్ సాధించి భారత్‌కు 3-0తో తిరుగులేని విజయాన్ని అందించాడు.

20 ఏళ్ల కల నెరవేరేనా?: ఈ మ్యాచ్‌లో విజయం సాధించినప్పటికీ, ఏఎఫ్‌సీ అండర్-20 ఏషియన్ కప్ ప్రధాన టోర్నీకి భారత్ అర్హత సాధిస్తుందా లేదా అనేది సాయంత్రం జరగనున్న సిరియా - ఉజ్బెకిస్తాన్ మ్యాచ్ ఫలితంపై ఆధారపడి ఉంటుంది. ఒకవేళ సిరియా జట్టు ఉజ్బెకిస్తాన్‌పై గెలవకపోతే, భారత్ గ్రూప్-బిలో రెండో స్థానంలో నిలిచి, అత్యుత్తమ రన్నరప్ జట్ల కోటాలో 20 సంవత్సరాల తర్వాత తొలిసారిగా ప్రధాన టోర్నమెంట్‌కు అర్హత సాధిస్తుంది.

# మలేషియాపై భారత్ ఘన విజయం





**11–1తో చిత్తుగా ఓడించిన భారత మహిళల జట్టు**

**జూనియర్ ఆసియా కప్‌లో వరుసగా రెండో గెలుపు.. అగ్రస్థానంలో భారత్**

బలగం టీవీ, హైదరాబాద్

ఏషియన్ హాకీ ఫెడరేషన్ (ఏహెచ్‌ఎఫ్) జూనియర్ ఆసియా కప్ ఎలైట్ పూల్‌లో భారత మహిళల జట్టు సత్తాచాటింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో మలేషియాను 11–1తో చిత్తుగా ఓడించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది. టోర్నీలో భారత్‌కు ఇది వరుసగా రెండో విజయం. తొలి మ్యాచ్‌లో దక్షిణ కొరియాపై 4–1తో గెలిచిన విషయం తెలిసిందే.

మలేషియాపై భారత్ తరఫున ఏడు మంది క్రీడాకారిణులు గోల్స్ సాధించారు. నాలుగు గోల్స్ ఫీల్డ్ ప్లే ద్వారా, ఐదు పెనాల్టీ కార్నర్లతో, మరో రెండు పెనాల్టీ స్ట్రోక్స్ ద్వారా నమోదయ్యాయి.

మ్యాచ్ ప్రారంభమైన తొలి నిమిషంలోనే పూజా సాహూ పెనాల్టీ స్ట్రోక్‌ను గోల్‌గా మలిచి భారత్‌కు శుభారంభం అందించింది. నాలుగో నిమిషంలో పూర్ణిమ యాదవ్ మరో గోల్ చేయడంతో ఆధిక్యం 2–0కు చేరింది. ఎనిమిదో నిమిషంలో బినిమా ధన్ పెనాల్టీ కార్నర్‌ను సద్వినియోగం చేసుకోగా, 14వ నిమిషంలో కృష్ణ శర్మ గోల్ చేసింది.

రెండో క్వార్టర్‌లో పూర్ణిమ 17వ నిమిషంలో పెనాల్టీ కార్నర్ ద్వారా మరో గోల్ చేసి తన ఖాతాలో రెండో గోల్ నమోదు చేసింది. 21వ నిమిషంలో సుఖ్‌వీర్ కౌర్, 28వ నిమిషంలో గీతా యాదవ్ గోల్స్ చేయడంతో తొలి అర్ధభాగం ముగిసే సరికి భారత్ 7–0 ఆధిక్యంలో నిలిచింది.

మూడో క్వార్టర్‌లో 38వ నిమిషంలో నూర్ మొహద్ మలేషియాకు ఏకైక గోల్ అందించింది. అయితే భారత్ జోరుకు ఏమాత్రం అడ్డుకట్ట పడలేదు. 42వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను పూజా సాహూ గోల్‌గా మలిచి తన రెండో గోల్ సాధించింది. 43వ నిమిషంలో సనికా చంద్రకాంత్ మానే గోల్ చేయడంతో భారత్ 9–1 ఆధిక్యంలోకి వెళ్లింది.

చివరి క్వార్టర్‌లోనూ భారత జట్టు దూకుడు కొనసాగించింది. 53వ నిమిషంలో గీతా యాదవ్ మరో పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచగా, 58వ నిమిషంలో సనికా మానే మరోసారి గోల్ చేసి భారత్ విజయాన్ని 11–1కు చేర్చింది.

ఈ విజయంతో భారత్ రెండు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు సాధించి ఆరు పాయింట్లతో ఎలైట్ పూల్‌లో అగ్రస్థానంలో ఉంది. చైనా, జపాన్ మూడు పాయింట్లతో వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. గోల్ తేడా ఆధారంగా ఇరు జట్ల స్థానాలు నిర్ణయమయ్యాయి. దక్షిణ కొరియా, మలేషియా వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో ఉన్నాయి.

భారత్ తన తదుపరి పూల్ మ్యాచ్‌లో సెప్టెంబర్ 8న జపాన్‌తో తలపడనుంది.

# రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపుపై శాంతి చర్చలు

**కీవ్‌లో అమెరికా ప్రతినిధుల భేటీ**

**రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశం తర్వాత కీవ్‌లో జెలెన్‌స్కీతో భేటీ అయిన స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్**

**ఉక్రెయిన్‌కు వైమానిక రక్షణ వ్యవస్థలు, శీతాకాల సహాయక ప్యాకేజీపై చర్చలు**

బలగం టీవీ, కీవ్



రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి దౌత్యపరమైన ముగింపు పలికే లక్ష్యంతో అమెరికా ప్రత్యేక ప్రతినిధులు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్‌లు ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో పర్యటించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో మోస్కోలో కీలక భేటీ ముగించుకున్న అనంతరం, వీరు ఆదివారం కీవ్‌కు చేరుకుని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీతో సమావేశమయ్యారు. ఈ భేటీలో బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ జాతీయ భద్రతా సలహాదారులు కూడా పాల్గొనడం గమనార్హం.

ఈ చర్చల్లో ఉక్రెయిన్ రక్షణ కోసం పేట్రియాట్ (Patriot) క్షిపణి నిరోధక వ్యవస్థల అవసరాన్ని, రాబోయే శీతాకాలాన్ని ఎదుర్కొనేందుకు విద్యుత్ మౌలిక వసతుల పరిరక్షణకు "వింటర్ ప్యాకేజీ" సహాయాన్ని జెలెన్‌స్కీ అమెరికా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. సైనిక చర్యల కంటే దౌత్యపరమైన పరిష్కారానికే అమెరికా మొగ్గు చూపుతోందని స్టీవ్ విట్‌కాఫ్ వెల్లడించారు. శాశ్వత శాంతి నెలకొల్పేందుకు ఇరు దేశాలు కొన్ని సడలింపులకు సిద్ధపడాల్సి ఉంటుందని అమెరికా ప్రతినిధులు పేర్కొన్నారు.

కొనసాగుతున్న దాడులు - పోప్ లియో XIV పిలుపు:

ఒకవైపు శాంతి చర్చలు జరుగుతున్నప్పటికీ, ఉక్రెయిన్, రష్యాలు పరస్పరం డ్రోన్ దాడులతో విరుచుకుపడ్డాయి. రష్యా ప్రయోగించిన 108 డ్రోన్లలో 82 డ్రోన్లను కూల్చివేసినట్లు ఉక్రెయిన్ ప్రకటించగా, ఉక్రెయిన్‌కు చెందిన 258 డ్రోన్లను తమ రక్షణ వ్యవస్థలు ధ్వంసం చేసినట్లు రష్యా వెల్లడించింది. కాగా, ఈ చర్చలు సత్ఫలితాలను ఇచ్చి ఉక్రెయిన్‌లో శాంతి నెలకొనాలని వాటికన్ సిటీ నుండి పోప్ లియో XIV ఆకాంక్షించారు

# ఇజ్రాయెల్‌పై ఇరాన్ ఏకకాల దాడులకు కుట్ర!




**2023 అక్టోబర్ 7 నాటి దాడి కంటే భయానకం:**

**'యాక్సిస్ ఆఫ్ రెసిస్టెన్స్' ప్రాక్సీ గ్రూపులతో ఇరాన్ బ్లూప్రింట్**

**నబతీయేపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు.. నలుగురు మృతి, 20 మందికి గాయాలు**

బలగం టీవీ, హైదరాబాద్

2023 అక్టోబర్ 7న హమాస్ జరిపిన దాడి కంటే అత్యంత భయానక రీతిలో ఇజ్రాయెల్‌పై ఏకకాలంలో విరుచుకుపడేందుకు ఇరాన్ ప్రణాళికలు రచిస్తోంది. తన అనుబంధ ప్రాక్సీ బలగాలన్నింటినీ ఏకం చేసి, "యాక్సిస్ ఆఫ్ రెసిస్టెన్స్" పేరిట నలువైపులా ఇజ్రాయెల్‌ను దిగ్బంధించి దెబ్బకొట్టేందుకు సిద్ధమవుతున్నట్లు ఇజ్రాయెల్ నిఘా వర్గాలు స్పష్టం చేశాయి.

ఇజ్రాయెల్‌కు చెందిన 'జెరూసలేం పోస్ట్' కథనం ప్రకారం.. ఇరాన్ తన రివల్యూషనరీ గార్డ్స్ (IRGC) పర్యవేక్షణలో లెబనాన్‌కు చెందిన హెజ్‌బొల్లా, యెమెన్ హూతీలు, గాజాలోని హమాస్, అలాగే ఇరాక్, సిరియాలలోని ఇరాన్ మద్దతు గల మిలీషియా గ్రూపులను ఒకే వేదికపైకి తీసుకొచ్చింది. గతంలో సరైన సమన్వయం లేకపోవడం వల్లే హమాస్ కేవలం సరిహద్దు దాడులకే పరిమితమైందని గుర్తించిన ఇరాన్, ఈసారి ఒక్క నిమిషం వ్యవధిలోనే అన్ని సరిహద్దుల నుంచి ఇజ్రాయెల్‌ను చుట్టుముట్టేలా ప్రణాళిక వేసింది. జులైలో హమాస్ అధినేతగా ఎన్నికైన ఖలీల్ అల్-హయ్యాకు ఇరాన్‌తో ఉన్న సత్సంబంధాలు ఈ ప్రతీకార వ్యూహాలకు మరింత ఊతమిస్తున్నాయి.

ఐఆర్‌జీసీ సమన్వయం - సరిహద్దుల్లో హైఅలర్ట్:

ఇరాన్ తన క్షిపణి, డ్రోన్ ఉత్పత్తిని వేగవంతం చేస్తూ సైనిక సామర్థ్యాలను పునరుద్ధరించుకుంటోంది. ఐఆర్‌జీసీకి చెందిన 'ఖుద్స్ ఫోర్స్' ఉన్నతాధికారులు ప్రాక్సీ కమాండర్లతో నిరంతరం సమావేశమవుతూ వ్యూహాలు అమలు చేస్తున్నారు. ఇరాన్ ఆరోపణలు, కుట్రల నేపథ్యంలో ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (IDF) తన ఉత్తర, దక్షిణ సరిహద్దుల్లో అత్యున్నత రక్షణ అలర్ట్‌ను ప్రకటించింది.

లేటెస్ట్ డెవలప్‌మెంట్స్ - లెబనాన్‌పై దాడులు:

మరోవైపు లెబనాన్‌లోని నబతీయే ప్రావిన్స్‌లోని పలు గ్రామాలపై ఇజ్రాయెల్ మళ్లీ వైమానిక దాడులకు తెగబడింది. అరబ్ సలీమ్ గ్రామంలోని నివాస భవనంపై జరిపిన దాడిలో నలుగురు ప్రాణాలు కోల్పోగా, ముగ్గురు పిల్లలు, ఐదుగురు మహిళలతో సహా 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి

# బలూచిస్థాన్‌లో ఆరుగురు పౌరులను కాల్చిచంపిన దుండుగులు

**మస్తుంగ్ జిల్లాలో మృతదేహాలు లభ్యం**

**వేర్పాటువాద ముష్కరుల చర్యగా అనుమానం**

బలగం టీవీ, హైదరాబాద్

పాకిస్థాన్‌లోని అశాంతితో రగిలిపోతున్న బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో ఉగ్రవాదులు మళ్లీ దారుణానికి ఒడిగట్టారు. మస్తుంగ్ జిల్లాలో ఆరుగురు పౌరులను తుపాకీతో కాల్చి దారుణంగా హత్య చేసినట్లు స్థానిక పోలీసులు ఆదివారం వెల్లడించారు.

మస్తుంగ్ సిటీ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్హెచ్‌ఓ) అబ్దుర్ రవూఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. బుల్లెట్ గాయాలతో ఉన్న ఆరుగురు పౌరుల మృతదేహాలను మస్తుంగ్ సమీపంలో గుర్తించారు. ప్రాథమిక విచారణలో వీరంతా సామాన్య పౌరులుగా ధ్రువీకరించబడినప్పటికీ, వారి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లభించలేదని అధికారి తెలిపారు. ఇప్పటివరకు ఏ వేర్పాటువాద లేదా ఉగ్రవాద సంస్థ కూడా ఈ హత్యలకు బాధ్యత వహించలేదు.

పెరుగుతున్న తీవ్రవాద దాడులు: ఈ ప్రాంతంలో పనిచేసే ఇతర ప్రావిన్సులకు చెందిన కార్మికులను, నిర్మాణ కార్మికులను వేర్పాటువాద గ్రూపులు అపహరించి, ఆపై నిర్మానుష్య ప్రాంతాల్లో కాల్చిచంపి పడేస్తుంటాయని పోలీసులు పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా, బలూచిస్థాన్ ప్రావిన్సుల్లో ఉగ్రవాద కార్యకలాపాలు, గెరిల్లా దాడులు తీవ్రస్థాయిలో పెరిగాయి.

# తూర్పు పసిఫిక్‌లో అమెరికా సైనిక ఆపరేషన్

**ఈక్వెడార్ నౌకల ధ్వంసం**

**మాదకద్రవ్యాల రవాణా నెట్‌వర్క్‌పై యూఎస్ సదరన్ కమాండ్ దాడి**

**సిబ్బంది సురక్షితం.. ఈక్వెడార్ అధికారులకు అప్పగింత**

బలగం టీవీ, హైదరాబాద్

తూర్పు పసిఫిక్ సముద్ర జలాల్లో అమెరికా సైనిక దళాలు (US Forces) సంచలన ఆపరేషన్ చేపట్టాయి. మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సహకరిస్తున్నాయనే ఆరోపణలపై ఈక్వెడార్‌కు చెందిన పలు వాణిజ్య నౌకలను అమెరికా బలగాలు అడ్డగించి సముద్రంలో ముంచివేశాయి. నౌకలను ధ్వంసం చేయడానికి ముందే వాటిలోని సిబ్బందిని ఖాళీ చేయించి, సురక్షితంగా ఈక్వెడార్ అధికారులకు అప్పగించడంతో ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

సెప్టెంబర్ 5, 6 తేదీల్లో ఈ ఆపరేషన్ జరిగినట్లు యూఎస్ సదరన్ కమాండ్ వెల్లడించింది. డ్రగ్స్ స్మగ్లర్లు సముద్రంలో ఏర్పాటు చేసుకున్న "తేలియాడే ఫ్యూయల్ స్టేషన్లను" లక్ష్యంగా చేసుకుని ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. యూఎస్ఎస్ శాన్ ఆంటోనియో యుద్ధనౌక నుంచి బయలుదేరిన హెలికాప్టర్లు, నౌకల నుండి సిబ్బందిని సురక్షితంగా బయటకు తెచ్చిన అనంతరం ఆయుధాలు ప్రయోగించి నౌకలను ధ్వంసం చేశాయి. అమెరికా ఇప్పటికే విదేశీ ఉగ్రవాద సంస్థగా ప్రకటించిన ఈక్వెడార్‌కు చెందిన 'లాస్ చోనెరోస్' అనే నేర ముఠాతో ఈ ఫ్యూయలింగ్ కేంద్రాలకు సంబంధాలు ఉన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు.

28 మంది సిబ్బంది అప్పగింత: అమెరికా చేపడుతున్న 'ఆపరేషన్ సదరన్ స్పియర్'లో భాగంగా ఈ ఆపరేషన్ జరిగింది. ఈ సుదీర్ఘ ఆపరేషన్‌లో ఇప్పటివరకు 70కి పైగా నౌకలను ధ్వంసం చేశారు. తాజా ఆపరేషన్‌లో భాగంగా నౌకల నుంచి అదుపులోకి తీసుకున్న 28 మంది సిబ్బందిని మాంటా పోర్టులో ఈక్వెడార్ అధికారులకు అమెరికా సైన్యం సురక్షితంగా అప్పగించింది. కాగా, పట్టుబడిన వారు కేవలం మత్స్యకారులేనని, వారి వద్ద డ్రగ్స్ లేవని బాధితుల బంధువులు వాదిస్తుండగా.. నేర ముఠాల లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌ను దెబ్బతీయడానికే ఈ సంయుక్త ఆపరేషన్ నిర్వహించినట్లు ఇరుదేశాల అధికారులు స్పష్టం చేశారు.

# డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో ఘోర ప్రమాదం

**పెళ్లి వేడుకలో అగ్నికీలలు.. 22 మంది దహనం**

**రాజధాని కిన్షాషాలోని లింగ్వాలాలో ఘటన**

**ఇరుకైన కారిడార్ల వల్ల పెరిగిన ప్రాణనష్టం**

బలగం టీవీ, హైదరాబాద్

డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (DRC) రాజధాని కిన్షాషాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. నగరం ఉత్తర భాగంలోని లింగ్వాలా ప్రాంతంలో ఉన్న ఒక భవనంలో శుక్రవారం రాత్రి జరిగిన పెళ్లి వేడుకలో ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగాయి. ఈ ఘోర ప్రమాదంలో ఇప్పటివరకు దాదాపు 22 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

అగ్నిప్రమాదం వేగంగా విస్తరించడం, భవనంలో వెళ్లే దారులు మరియు కారిడార్లు చాలా ఇరుకుగా ఉండటంతో బయటకు పరుగులు తీసే క్రమంలో తొక్కిసలాట జరిగి భయానక వాతావరణం నెలకొంది. ప్రమాద తీవ్రతకు భవనంలో చాలామంది చిక్కుకుపోగా, బయటపడిన బాధితులు తీవ్ర గాయాలతో రోడ్డుపై పడిపోయారు. సమాచారం అందుకున్న సహాయక బృందాలు ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు.

విచారణకు ఆదేశం:

లింగ్వాలా మేయర్ నార్బర్ట్ ముషింగ మరియు కాంగో ఉప ప్రధాని జాక్వెమిన్ షబానీ సంఘటనా స్థలాన్ని సందర్శించి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇప్పటివరకు లభించిన ప్రాథమిక సమాచారం ప్రకారం 22 మంది మరణించారని, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ లేదా డెకరేషన్ మెటీరియల్ కారణమై ఉండవచ్చని అనుమానిస్తుండగా, ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తుకు ఆదేశించారు.

# ఇరాన్‌లో ఆయిల్ ట్యాంకర్ ఘోర పేలుడు

**11 మంది దుర్మరణం, ఏడుగురికి గాయాలు**

**సనందాజ్ - హమేదాన్ రహదారిపై ఘోర ప్రమాదం**

**బ్రేకులు ఫెయిలై ఇతర వాహనాలను ఢీకొట్టిన ట్యాంకర్**

బలగం టీవీ, హైదరాబాద్

పశ్చిమ ఇరాన్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆయిల్ ట్యాంకర్ పేలిపోయిన ఘోర ప్రమాదంలో 11 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. కుర్దిస్తాన్ ప్రావిన్స్‌లోని సనందాజ్ కౌంటీని, హమేదాన్ ప్రావిన్స్‌లోని హమేదాన్ కౌంటీతో అనుసంధానించే బిజీ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది.

ప్రాథమిక సమాచారం ప్రకారం.. రోడ్డుపై వేగంగా వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ బ్రేకులు ఒక్కసారిగా ఫెయిలయ్యాయి. దీంతో నియంత్రణ కోల్పోయిన ట్యాంకర్, తన ముందు వెళ్తున్న పలు వాహనాలను బలంగా ఢీకొట్టింది. ఈ క్రమంలో ట్యాంకర్‌లోని ఇంధనం లీకై భారీ పేలుడు సంభవించింది. క్షణాల్లోనే అగ్నికీలలు వ్యాపించడంతో పక్కనే ఉన్న కార్లు, ఇతర వాహనాలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి.

స్తంభించిన ట్రాఫిక్ - సహాయక చర్యలు: సమాచారం అందుకున్న పోలీసులు, అత్యవసర సహాయక బృందాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చాయి. గాయపడిన ఏడుగురిని సనందాజ్‌లోని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద తీవ్రతకు రహదారిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. బ్రేకులు ఫెయిల్ కావడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని భావిస్తుండగా, అధికారులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




EPFO
Employees Provident Fund Organisation

## ఉద్యోగం మధ్యలోనే మానేస్తే పీఎఫ్ నిధులపై వడ్డీ వస్తుందా?

**ఈపీఎఫ్ఓ స్పష్టత**

**58 ఏళ్ల వయసు వరకు నిధులపై వడ్డీ లభించే అవకాశం**

**ప్రస్తుతం ఈపీఎఫ్‌పై లభిస్తున్న 8.25 శాతం వడ్డీ**

బలగం టీవీ, హైదరాబాద్

ఉద్యోగ భవిష్య నిధి (ఈపీఎఫ్) ఖాతా కలిగిన ఉద్యోగులు ఏదైనా కారణంతో పదవీ విరమణకు ముందే ఉద్యోగం మానేస్తే ఖాతాలోని నిధులపై వడ్డీ వస్తుందా లేదా అనే సందేహాలకు ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (EPFO) స్పష్టతనిచ్చింది. ఉద్యోగం వదిలేసినంత మాత్రాన వెంటనే వడ్డీ నిలిచిపోదని, ఖాతా 'ఇన్‌ఆపరేటివ్' (Inoperative) కానంత వరకు 58 ఏళ్ల వయసు వరకు వడ్డీ జమ అవుతుందని స్పష్టం చేసింది.

సాధారణంగా ఉద్యోగి తన ప్రాథమిక జీతంలో 12 శాతాన్ని పీఎఫ్ ఖాతాకు చెల్లిస్తే, అంతే మొత్తాన్ని యాజమాన్యం కూడా జమ చేస్తుంది. ఈ నిధులపై కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం ఏటా 8.25 శాతం వడ్డీని అందిస్తోంది. చక్రవడ్డీ రూపంలో లభించే ఈ రాబడికి ఆదాయ పన్ను మినహాయింపు కూడా ఉంటుంది. అయితే ఉద్యోగం మానేసిన పరిస్థితుల్లో ఈపీఎఫ్ ఖాతా ఎప్పుడు ఇన్‌ఆపరేటివ్‌గా మారుతుందో తెలుసుకోవడం చాలా ముఖ్యం.

ఈపీఎఫ్ ఖాతా ఎప్పుడు 'ఇన్‌ఆపరేటివ్' అవుతుంది?:

55 ఏళ్ల తర్వాత రిటైర్ అయితే: 55 ఏళ్లు నిండిన తర్వాత రిటైర్ అయి, ఆ తేదీ నుంచి 36 నెలల (3 ఏళ్లు) వరకు ఎలాంటి కాంట్రిబ్యూషన్ లేకపోతే ఆ ఖాతా 'ఇన్‌ఆపరేటివ్'గా మారి, వడ్డీ రావడం ఆగిపోతుంది.

55 ఏళ్ల కంటే ముందే మానేస్తే: 40 లేదా 45 ఏళ్ల వయసులో ఉద్యోగం మానేసిన సందర్భాల్లో 58 ఏళ్లు నిండే వరకు ఆ ఖాతా సక్రియంగానే (Active) ఉంటుంది. దానివల్ల నిధులపై వడ్డీ కొనసాగుతుంది.

ఇతర సందర్భాలు: చందాదారుడు శాశ్వతంగా విదేశాలకు వలస వెళ్లినా లేదా మరణించినా ఆ ఖాతాలు ఇన్‌ఆపరేటివ్‌గా మారుతాయి.

అత్యవసర ఆర్థిక ఇబ్బందులు లేకపోతే పీఎఫ్ నిధులను ఉపసంహరించుకోకుండా ఉంచడం ద్వారా రిటైర్మెంట్ సమయానికి చక్రవడ్డీ ప్రయోజనంతో పెద్ద మొత్తంలో నిధిని సమకూర్చుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.





## ఇండోనేషియాలో బద్ధలైన అనక్ క్రాకటోవా అగ్నిపర్వతం

**జకార్తా విమానాశ్రయం మూసివేత**

**150 కిలోమీటర్ల దూరంలో ఉన్న సూకర్ణో-హట్టా అంతర్జాతీయ విమానాశ్రయం తాత్కాలికంగా బంద్**

**ఆగిపోయిన వందలాది విమాన సర్వీసులు, తీవ్ర అవస్థల్లో వేలాది మంది ప్రయాణికులు**

బలగం టీవీ, హైదరాబాద్

ఇండోనేషియాలోని సుండా జలసంధిలో ఉన్న అనక్ క్రాకటోవా (Anak Krakatoa) అగ్నిపర్వతం భారీగా బద్ధలైంది. శని, ఆదివారాల్లో అగ్నిపర్వతం నుంచి వెలువడిన వేడి లావా, దట్టమైన అగ్నిపర్వత బూడిద వాతావరణంలో వేల అడుగుల ఎత్తు వరకు వ్యాపించాయి. అగ్నిపర్వత బూడిద సుమారు 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజధాని జకార్తాకు సమీపంలోని సూకర్ణో-హట్టా అంతర్జాతీయ విమానాశ్రయ ఆకాశమార్గాన్ని కమ్మేయడంతో అధికారులు అప్రమత్తమయ్యారు.

విమానాల ఇంజిన్లకు అగ్నిపర్వత బూడిద వల్ల ప్రమాదం పొంచి ఉండటంతో, భద్రతా కారణాల దృష్ట్యా సూకర్ణో-హట్టా విమానాశ్రయంతో పాటు మరో ఏడు ప్రాంతీయ విమానాశ్రయాల్లో విమాన రాకపోకలను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ హఠాత్ పరిణామం వల్ల సింగపూర్, సిడ్నీ, దోహా, కౌలాలంపూర్ వంటి ప్రధాన అంతర్జాతీయ రూట్లతో పాటు, బాలికి వెళ్లే పలు దేశీయ విమాన సర్వీసులు రద్దయ్యాయి. దాంతో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఓడలకు హెచ్చరికలు:

అగ్నిపర్వతం కేంద్రం నుండి 3 కిలోమీటర్ల పరిధిని నిషిద్ధ ప్రాంతంగా (Exclusion Zone) అధికారులు ప్రకటించారు. ఆ మార్గంలో ప్రయాణించే నౌకలు మరియు పడవలు అప్రమత్తంగా ఉండాలని పోర్ట్ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. 1883లో సంభవించిన ప్రసిద్ధ క్రాకటోవా అగ్నిపర్వత విస్ఫోటనం తర్వాతి కాలంలో ఈ అనక్ క్రాకటోవా ఏర్పడింది.



## ఈజిప్టులో టీవీ ప్రెజెంటర్ సారా ఖలీఫాకు ఉరిశిక్ష విధించిన కోర్టు

**భారీ స్థాయిలో మత్తుపదార్థాల తయారీ, సరఫరా కేసులో సంచలన తీర్పు**

**మొత్తం 12 మందికి మరణశిక్ష.. మరో 9 మందికి జీవిత ఖైదు**

బలగం టీవీ, హైదరాబాద్

ఈజిప్టుకు చెందిన ప్రముఖ టెలివిజన్ యాంకర్ సారా ఖలీఫా (39)కు అక్కడి న్యాయస్థానం ఉరిశిక్ష విధిస్తూ సంచలన తీర్పునిచ్చింది. అంతర్జాతీయ స్థాయిలో భారీ ఎత్తున మత్తుపదార్థాలను (సింథటిక్ డ్రగ్స్) దిగుమతి చేసుకుని, తయారుచేసి విక్రయిస్తున్నారనే తీవ్రమైన ఆరోపణలు రుజువు కావడంతో సారా ఖలీఫాతో పాటు మరో 11 మంది నిందితులకు కైరో కోర్టు మరణశిక్ష ఖరారు చేసింది.

'మిషన్ ఇంపాజిబుల్' అనే నేర పరిశోధనాత్మక కార్యక్రమం ద్వారా ఈజిప్టులో గుర్తింపు పొందిన సారా ఖలీఫా, ఒక బ్యూటీ క్లినిక్ మరియు ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీని కూడా నిర్వహిస్తున్నారు. విదేశాల నుంచి ముడిసరుకును రప్పించి ఈజిప్టులోని రెండు రహస్య ల్యాబొరేటరీలలో మత్తుపదార్థాలను తయారుచేస్తున్నారనే ఆరోపణలపై 2025 ఏప్రిల్‌లో ఆమెను పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో భాగంగా అధికారులు నిందితుల నుంచి దాదాపు 750 కేజీల మత్తుపదార్థాలు, ముడిసరుకులతో పాటు లైసెన్స్ లేని ఆయుధాలు, తటస్థించిన సాంకేతిక ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు.

తీర్పు సవాలుకు అవకాశం:

విచారణ సందర్భంగా సారా ఖలీఫా తనపై వచ్చిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. తాను జీవితంలో ఎప్పుడూ సిగరెట్ కూడా తాగలేదని, పోలీసుల స్వాధీనంలోనే మొదటిసారి డ్రగ్స్ చూశానని కోర్టు ముందు కన్నీటిపర్యంతమయ్యారు. అయితే, 20 మంది సాక్షుల వాంగ్మూలాలు, డిజిటల్ ఆధారాలను పరిశీలించిన కోర్టు ఈ శిక్షను ఖరారు చేసింది. ఈజిప్టు చట్టాల ప్రకారం మరణశిక్ష అమలుకు ముందు గ్రాండ్ ముఫ్తీ ఆధ్యాత్మిక సమ్మతి అవసరం కాగా, ఆయన అభిప్రాయం అనంతరం కోర్టు తీర్పును అధికారికంగా స్థిరీకరించింది. కాగా, ఈ మరణశిక్ష తీర్పుపై ఉన్నత న్యాయస్థానంలో అప్పీల్ చేయనున్నట్లు ఖలీఫా తరపు న్యాయవాది తెలిపారు.

బలగం TV BALAGAM
balagamtv100@gmail.com

CINEMA

# బాక్సాఫీస్ బరిలో నాగ్ తో బాలయ్య డైరెక్ట్ ఢీ



## ఒకేరోజు ఈ రెండు మూవీలు విడుదల



నందమూరి బాలకృష్ణ- గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న క్రేజీ ఫిల్మ్.. ఎన్బీకే 111. వృద్ధి సినిమాస్ పతాకంపై కిలారు వెంకట సతీష్ ఈ సినిమాను నిర్మిస్తోన్నారు. తమన్ సంగీతాన్ని సమకూర్చుతున్నారు. మరోసారి బాలయ్య- కాజల్ అగర్వాల్ జతకట్టడంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన చిత్రాలు ప్రేక్షకులను అలరించడం దీనికి కారణం. ఈ మూవీలో బాలయ్య మాస్ లుక్ తో కనిపించడం హైప్ పెంచింది. ఈ ఫిల్మ్ టైటిల్ గ్లింప్స్, విడుదల తేదీ వెల్లడయ్యాయి. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు 'దాదా' అనే పవర్‌ఫుల్ టైటిల్ ఖరారు అయింది. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 24వ తేదీన విడుదల కానుంది. రగ్డ్ అండ్ పవర్‌ఫుల్ అవతార్‌లో కనిపించాడు. శత్రువుల ఆట కట్టిస్తూ యాక్షన్ సీక్వెన్స్‌లతో బాలయ్య చేసిన విధ్వంసం సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. బాలయ్య పలికిన డైలాగ్స్ అద్దిరిపోయాయి.'నాకు గురి పెట్టాలంటే.. ఒంట్లో పవర్, వేలికి ట్రిగ్గర్ ఉంటే సరిపోదు.. బుల్లెట్స్ కి బలుపు ఉండాలి.. గన్స్ కి గట్స్ ఉండాలి..' అనే డైలాగ్స్ కు విజిల్స్ పడటం ఖాయం. ఈ గ్లింప్స్‌లో ఆయనను కింగ్ ఆఫ్ ఖోస్ అని అభివర్ణించిన విధానం ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పిస్తోంది. తమన్ అందించిన నేపథ్య సంగీతం ఈ ఎలివేషన్ గ్లింప్స్‌ను నెక్స్ట్ లెవెల్ కు తీసుకెళ్లింది. ముంబై మాఫియాతో మొదలవుతుందీ గ్లింప్స్. పోలీస్ స్టేషన్ లో ఫైట్ హైలైట్. అక్కినేని నాగార్జున నటిస్తోన్న 100వ చిత్రం కింగ్ తో బాలయ్య ఫిల్మ్ డైరెక్ట్ గా ఢీ కొడుతోంది. డిసెంబర్ 24వ తేదీ నాడే కింగ్100 కూడా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. దీంతో బాలయ్య, నాగార్జున మధ్య బాక్సాఫీస్ వద్ద భారీ క్లాష్ అనివార్యమైంది. ఈ ఇద్దరు సీనియర్ స్టార్ హీరోల సినిమాలు ఒకే రోజు విడుదలవుతుండటంతో ఫ్యాన్ వార్ కూడా తప్పకపోవచ్చు. క్రిస్మస్ పండుగ సెలవులు, లాంగ్ వీకెండ్ అడ్వాంటేజ్ రెండు సినిమాలకు కలిసి వస్తోండటంతో డిసెంబర్ 24వ తేదీనే ఖరారు చేశారు దాదా మేకర్స్.

# అందరిని సర్‌ప్రైజ్ చేస్తుంది



త ఏడాది 'ఓజీ' చిత్రంతో తెలుగులో మంచి విజయాన్ని దక్కించుకుంది తమిళ సొగసరి ప్రియాంక మోహన్. తాజాగా ఈ భామ తమిళంలో మరో బంపరాఫర్‌ను సొంతం చేసుకుంది. శింబు 'అరసన్' చిత్రంలో ఆమె కథానాయికగా ఎంపికైంది. ఓ అవార్డు వేడుకలో వెల్లడించింది ప్రియాంక మోహన్. వెట్రిమారన్ ఈ చిత్రానికి దర్శకుడు. ఉత్తర చెన్నై నేపథ్యంలో గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో అవకాశం రావడం పట్ల ప్రియాంక మోహన్ ఆనందం వ్యక్తం చేసింది.'వెట్రిమారన్ మేకింగ్‌స్టైల్ నాకు చాలా ఇష్టం. ఆయన ఎంచుకునే కథలు కూడా వాస్తవికతను ప్రతిబింబిస్తాయి. 'అరసన్'లో నా పాత్ర మునుపెన్నడూ చూడని రీతిలో ఉంటుంది. అందరిని సర్‌ప్రైజ్ చేస్తుంది. ఈ సినిమా కోసం నేను నార్త్ చెన్నై తాలూకు యాసను నేర్చుకున్నా' అని చెప్పింది ప్రియాంక మోహన్. 'అరసన్' చిత్రంలో విజయ్ సేతుపతి, ఆండ్రియా జెరెమియా, సముద్రఖని తదితరులు కీలక పాత్రల్ని పోషిస్తున్నారు.

# ఘనంగా 'మండాడి' ప్రీ రిలీజ్ ఈవెంట్..

## సినిమాపై హైప్ పెంచేసిన చిత్ర యూనిట్!

తమిళ వర్సటైల్ నటుడు సూరి, టాలీవుడ్ ట్రెండ్ సెట్టింగ్ యంగ్ హీరో సుహాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక మరియు విభిన్నమైన ఇంటెన్స్ యాక్షన్ డ్రామా 'మండాడి'. ప్రముఖ నిర్మాత ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్‌ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ పతాకంపై టాలెంటెడ్ డైరెక్టర్ మతిమారన్ పుగళేంది ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. బోట్ రేసింగ్ ప్రధానాంశంగా, ఎవ్వరూ చూడని సరికొత్త సముద్రపు నేపథ్యంలో అత్యంత రిస్క్‌తో కూడిన ఛాలెంజింగ్ పరిస్థితులలో ఈ సినిమాను రూపొందించారు. ఇందులో టాలెంటెడ్ నటి మహిమా నంబియార్ కథానాయికగా నటిస్తుండగా.. సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్ వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో ప్రేక్షకులను అలరించనున్నారు. సెప్టెంబర్ 10న







ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతున్న తరుణంలో, చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో అత్యంత ఘనంగా ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు శివ నిర్వాణ ముఖ్య అతిథిగా విచ్చేసి సినిమా పోస్టర్లు, ప్రమోషనల్ కంటెంట్‌పై ప్రశంసలు కురిపిస్తూ యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలో హీరో సుహాస్ మాట్లాడుతూ.. తన సినీ ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులను దాటుకుంటూ ఈ స్థాయికి చేరుకున్నానని భావోద్వేగంగా పంచుకున్నారు. ఈ రోజు గురువారపు పండుగ రోజున తన ఉపాధ్యాయులు తన ముందే ఉండటం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఈ చిత్రంలో మహిమ, రవీంద్ర విజయ్, సూరిల అభినయం సినిమాకు ప్రధాన ప్రాణంగా నిలుస్తాయని, ఇదొక వినూత్న థియేట్రికల్ అనుభూతిని ఇస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తమిళ నటుడు సూరి తనదైన శైలిలో మాట్లాడుతూ.. తెలుగు ప్రేక్షకులు తనపై చూపిస్తున్న ఆప్యాయతకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే తను అనర్గళంగా తెలుగు మాట్లాడటానికి ప్రయత్నిస్తానని చెప్పి అందరినీ నవ్వించారు. సుహాస్‌తో కలిసి పనిచేయడం తనకు ఎంతో తృప్తినిచ్చిందని, బోట్ రేసింగ్ మరియు యాక్షన్ ఎపిసోడ్స్ ఆడియన్స్‌కు సరికొత్త లోకాన్ని పరిచయం చేస్తాయని పేర్కొన్నారు. ఈ వేడుకలో పాల్గొన్న ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు మాట్లాడుతూ.. సముద్రపు అలల మధ్య, ప్రాణాలకు తెగించి ఈ సినిమాను ఎంతో కష్టపడి షూట్ చేశామని తెలిపారు. ముఖ్యంగా మైత్రి మూవీ మేకర్స్ అధినేత నవీన్ తమకు అందించిన అనూహ్య సహకారాన్ని, ఓటీటీ డీల్స్‌లో ఆయన చేసిన మేలును ప్రొడ్యూసర్ ఎల్రెడ్ కుమార్ కృతజ్ఞతాపూర్వకంగా గుర్తుచేసుకున్నారు. ఈ ఈవెంట్‌కు స్పెషల్ గెస్ట్‌గా విచ్చేసిన ప్రముఖ డైరెక్టర్ శివ నిర్వాణ మాట్లాడుతూ.. 'మండాడి' చిత్రంలోని కొన్ని కీలక సన్నివేశాలు, రషెస్ చూసినప్పుడే ఈ సినిమా ఘనవిజయం సాధించడం ఖాయమని ఫిక్స్ అయ్యానని, భవిష్యత్తులో ఈ చిత్రానికి జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు దక్కుతాయని జోస్యం చెప్పారు. మరో అతిథిగా విచ్చేసిన హిట్ డైరెక్టర్ శైలేష్ కొలను మాట్లాడుతూ.. సముద్రంలో బోట్ షాట్స్ తీయడంలోని కష్టాలను ప్రస్తావిస్తూ, సినిమా మొత్తం సముద్రంలోనే తెరకెక్కించడం సాహసోపేతమని, ఇందుకు యూనిట్ అంకితభావాన్ని కొనియాడాలని అన్నారు. మొత్తానికి, విభిన్నమైన కథాంశంతో, పవర్‌ఫుల్ యాక్షన్ ఎమోషన్స్‌తో, బోట్ రేసింగ్ బ్యాక్‌డ్రాప్‌తో రాబోతున్న 'మండాడి' సినిమా సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి!

# బిగ్ బాస్‌లో శివాజీ సర్ ప్రైజ్ ఎంట్రీ



బుల్లితెరపై అత్యంత ప్రజాదరణ పొందిన రియాలిటీ షో బిగ్ బాస్ తెలుగు సీజన్ 10 ప్రేక్షకులను పలకరించింది. కింగ్ అక్కినేని నాగార్జున హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఈ ప్రతిష్టాత్మక 10వ సీజన్ ఈ సాయంత్రం 7 గంటలకు లాంచ్ అయింది. 10వ సీజన్ కావడంతో ఈ సారి డిఫరెంట్ గా దశావతారం థీమ్‌తో షోను మరింత ఉత్కంఠభరితంగా రూపొందించారు. ఇందులో పాల్గొనే కంటెస్టెంట్లు ఎవరనే ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. ప్రేక్షకుల ఆదరణ పొందిన దేబ్జానీ మోదక్.. బిగ్ బాస్ హౌస్‌లోకి గ్రాండ్ ఎంట్రీ ఇచ్చారు. ఎన్నెన్నో జన్మల బంధం, సత్యభామ వంటి సూపర్ హిట్ సీరియల్స్‌తో తెలుగు ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయిన ఈ బెంగాలీ బ్యూటీ తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆమె తర్వాత యువ కథానాయకుడు త్రిగుణ్ ఎంటర్ అయ్యాడు. ఇటీవలే హార్రర్ మూవీ ఈషా, చెన్నై లవ్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకొచ్చాడీ హీరో. బిగ్ బాస్ సీజన్ 10 హౌస్ లోపల జరిగే పరిణామాలను విశ్లేషించే బిగ్ బాస్ బజ్ షో కూడా సిద్ధమైంది. ప్రముఖ నటుడు శివాజీ ఈ టాక్ షోకు హోస్ట్‌గా వ్యవహరించబోతోన్నాడు. హౌస్‌మేట్స్‌ను హాట్ సీట్‌లో కూర్చోబెట్టనున్నాడు. ఎలిమినేట్ అయిన కంటెస్టెంట్లను శివాజీ ప్రశ్నలు అడిగే ప్రోగ్రామ్ ఇది. అన్‌ఫిల్టర్డ్ ఎంటర్‌టైన్‌మెంట్ అందించనున్నాడు. ఇది ఆట కాదు.. వేట అంటూ సాగే ఈ కార్యక్రమం ప్రేక్షకులలో సరికొత్త ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ఈ బిగ్ బాస్ బజ్ టాక్ షో ఈ నెల 7 వ తేదీ నుంచి ప్రతిరోజూ ఉదయం 10 గంటలు, సాయంత్రం 6 గంటలకు స్టార్ మా మ్యూజిక్ ఛానల్‌లో ప్రసారం కానుంది. ఇదివరకటి కంటే ఈ సారి డ్రామా, టాస్కులు మరింత రసవత్తరంగా ఉండబోతున్నాయని భావిస్తోన్నందున.. బుల్లితెర వీక్షకులలో ఈ సరికొత్త సీజన్‌పై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి.

# బిగ్ బాస్ హౌస్‌లోకి జబర్దస్త్ స్టార్-రచ్చ రచ్చే



ఎప్పుడెప్పుడా అంటూ ఎదురుచూస్తోన్న బిగ్ బాస్ తెలుగు సీజన్ 10.. సరికొత్త హంగులతో గ్రాండ్ గా లాంచ్ అయింది. ఈ సారి హౌస్‌లోకి అడుగుపెట్టిన కంటెస్టెంట్లు.. ఈ షోపై అంచనాలను భారీగా పెంచేస్తోన్నారు. సోషల్ మీడియా తారల నుండి వెండితెర, బుల్లితెర సెలబ్రిటీల వరకు విభిన్న మనస్తత్వాలు కలిగిన వ్యక్తులు ఈసారి కూడా బిగ్ బాస్ హౌస్ లో సందడి చేయనున్నారు. తమ టాస్క్ తో షో ను హీటెక్కించనున్నారు. కంటెస్టెంట్ల ఎంపిక ప్రక్రియలో తీసుకొచ్చిన మార్పులు, ప్రయోగాలు ఈ సీజన్ పై మరింత ఆసక్తిని పెంచాయి. జబర్దస్త్ షో ద్వారా తెలుగు రాష్ట్రాల్లో క్రేజ్ సంపాదించుకున్న కమెడియన్ నరేష్ పూర్తి జోష్‌తో ఎంట్రీ ఇచ్చాడు. తనదైన కామెడీ టైమింగ్, ఎనర్జీ, సరికొత్త స్టైలిష్ స్వాగ్‌తో గ్రాండ్ లాంచ్ వేదికపై సందడి చేశాడు. అగ్నిపరీక్ష ద్వారా చరణ్, సృష్టి ఈ హౌస్ లోకి ఎంట్రీ ఇచ్చారు. కామనర్స్ కు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వడం ఈ సీజన్ స్పెషాలిటీగా చెప్పుకోవచ్చు. ప్రేక్షకుల ఓటింగ్ ద్వారా హౌస్‌లోకి అడుగుపెట్టే అరుదైన అవకాశాన్ని చరణ్ దక్కించుకున్నాడు. వెండితెరపై మాయమైన నటుడు కృష్ణుడు.. ఇప్పుడు బిగ్ బాస్ హౌస్ లో ప్రత్యక్షం అయ్యాడు. అతనితో పాటు కామనర్ గా సృష్టి కూడా కంటెస్టెంట్‌గా బిగ్ బాస్ హౌస్‌లోకి అడుగుపెట్టింది. షో నిర్వాహకులు ప్రవేశపెట్టిన కఠినమైన అగ్నిపరీక్ష' టాస్క్‌ను విజయవంతంగా పూర్తి చేయడం ద్వారానే సృష్టి.. ఫ్రీ ఎంట్రీ టికెట్ అందుకోగలిగింది. ఈ సీజన్ లో కామనర్లను ఎంపిక చేసే బాధ్యతను యాంకర్ బిగ్ బాస్ మాజీ రన్నరప్ శ్రీముఖి చేపట్టడం మరో ప్రధాన ఆకర్షణ. హౌస్‌లోకి అడుగుపెట్టే ముందు కామనర్ల ఓర్పు, బుద్ధి బలం, శారీరక సామర్థ్యాలను నిరూపించే సవాలుతో కూడిన అగ్నిపరీక్ష టాస్క్‌లను ఆమె ముందుండి నడిపించారు.

# నందమూరి మోక్షజ్ఞ అరంగేట్రం ఖరారు..





నందమూరి అభిమానులు, తెలుగు సినీ ప్రేక్షకులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న శుభ తరుణం రానేవచ్చింది. నటసింహం నందమూరి బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ తేజ సినీ అరంగేట్రం అధికారికంగా ఖరారైంది. అతడి తొలి చిత్రానికి 'బింబిసార' వంటి బ్లాక్‌బస్టర్‌ను అందించిన యువ దర్శకుడు మల్లిడి వశిష్ట దర్శకత్వం వహించనున్నారు. టాలీవుడ్‌లోని అగ్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన మైత్రీ మూవీ మేకర్స్ ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని నిర్మించనుంది. మోక్షజ్ఞ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం ఈ భారీ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు మైత్రీ మూవీ మేకర్స్ తమ సోషల్ మీడియా ఖాతా ద్వారా ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ ఫొటోలో బాలకృష్ణ, మోక్షజ్ఞ, దర్శకుడు వశిష్ట ముగ్గురూ కలిసి కనిపించడంతో అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఈ సందర్భంగా మేకర్స్ ఒక పవర్‌ఫుల్ క్యాప్షన్‌ను జోడించారు. "డెన్‌ను వదిలిన కూన ఇప్పుడు సింహంలా అడవిలోకి ఎంటర్ అయింది" అంటూ మోక్షజ్ఞ ఎంట్రీని అభివర్ణించారు. ఈ ప్రకటనతో నందమూరి అభిమానుల్లో పండుగ వాతావరణం నెలకొంది. కొన్నేళ్లుగా మోక్షజ్ఞ ఎంట్రీ గురించి జరుగుతున్న ఊహాగానాలకు ఈ ప్రకటనతో పూర్తిస్థాయిలో తెరపడినట్లయింది. 'బింబిసార' చిత్రంతో దర్శకుడిగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వశిష్ట, ఇప్పుడు నందమూరి వారసుడిని హీరోగా పరిచయం చేసే బాధ్యతను తీసుకోవడం ప్రాజెక్ట్‌పై అంచనాలను రెట్టింపు చేసింది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలతో పాటు, చిత్రీకరణ ఎప్పుడు ప్రారంభమవుతుందనే విషయాలను వెల్లడించనున్నట్లు తెలుస్తోంది.